ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పశ్చిమ గోదావరి
జిల్లా వార్తలు
5
శుక్రవారం 2 ఆగస్టు 2024



నరసాపురం రేవులో నిలిచిన పంటు, పడవలు

## మరింత తగ్గిన వరద

ఆచంట/నరసాపురం, ఆగస్టు 1 : గోదావరి నీటిమట్టం గురువారం సాయంత్రానికి తగ్గుముఖం పట్టింది. భద్రాచలం వద్ద నీటిమట్టం 41.20 అడుగులకు చేరడంతో మొదటి ప్రమాద హెచ్చరిక ఉపసంహరించారు. పోలవరంలో ప్రాజెక్టు స్పిల్వే నుంచి 9,65,820 క్యూసెక్కుల వరద జలాలను దిగువకు విడుదల చేశారు. ధవళేశ్వరం వద్ద గోదావరి నీటిమట్టం 14.42 మీటర్లు నమోదు కాగా, 10,60,000 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడుదల చేశారు. మొదటి ప్రమాద హెచ్చరిక ఇంకా అమలులోనే ఉంది. ఆచంట మండలంలోని ముంపు బారిన పడిన లంక గ్రామాలు బురదమయంగా మారాయి. పుష్కర ఘాట్‌లు బయట పడుతున్నాయి. గోదావరిలో పడవల రాకపోకలు నామమాత్రంగానే ఉన్నాయి. వశిష్ఠ గోదావరికి వరద పోటు క్రమంగా తగ్గుముఖం పట్టింది. ఎగువ నుంచి ఇన్ ఫ్లో తగ్గడంతో రేవుల్లోని నీటిమట్టాలు తగ్గుతున్నాయి. నీటి ప్రవాహం ఉధృతంగానే వుంది. పొన్నపల్లిలో సాధారణ పరిస్థితి నెలకొంది. మోటార్ల సాయంతో నీటిని మునిసిపల్ సిబ్బంది బయటకు తోడారు. వరద మరింత తగ్గితే సోమవారం నుంచి మాధవాయిపాలెం పంటు రాకపోకలకు అనుమతిస్తారు. రేవులన్నీ బురదమయం కావడంతో పంటు దిగి వెళ్లాలంటే ప్రయాణీకులకు ఇబ్బందులు తప్పవు. మూడు రోజులు ఎండ కాస్తే గాని రేవుల్లో సాధారణ పరిస్థితి రాదు.

### రేవు పాట రూ.63 లక్షలు తగ్గింపు !

నరసాపురం రూరల్, ఆగస్టు 1: మాధవాయిపాలెం రేవు పాట ప్రారంభ ధరను రూ.3.61 కోట్ల నుంచి రూ.2.97 కోట్లకు తగ్గిస్తూ జాయింట్ యాక్షన్ కమిటీ గురువారం నిర్ణయం తీసుకుంది. మండల పరిషత్ కార్యాలయంలో సమావేశమైన కమిటీ మూడుసార్లు నోటిఫికేషన్ ఇచ్చినా.. పాటదారులెవరూ ఆసక్తి చూపకపోవడంతో ప్రారంభధరను రూ.63 లక్షలు తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నట్లు ఎంపీడీవో వీరభద్రరావు చెప్పారు. కమిటీ నిర్ణయాన్ని జిల్లా సీఈవోకు నివేదిస్తామన్నారు. నరసాపురం, మలికిపురం ఎంపీపీలు సోని, మల్లికార్జునరావు, సఖినేటిపల్లి ఎంపీడీవో పీవీ సత్యనారాయణ, డీఎల్‌పీవో శ్రీనివాస్, జెడ్పీటీసీ రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తాకట్టు లో..గుట్టు ఏమిటి ?
సిలబస్ మార్చుకుంటే కష్టమేనా ?
గ్రీన్ ట్యాక్స్ మోత ఆగేనా ?
ఆలమూరులో విషజ్వరాలు
ప్రత్యేక కథనాలు 7లో..

# ఇళ్లు కట్టినట్టు కనికట్టు



వేసింది ఊచలు.. కాని బేస్‌మెంట్ వేసినట్టు చూపిన ఇంటి నిర్మాణమిది

## తాడేపల్లిగూడెం జగనన్న కాలనీలో మాయాజాలం

## నిర్మించకుండానే భారీగా బిల్లులు, మెటీరియల్ స్వాహా

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పేదల ఇళ్ల నిర్మాణం కోసం ఏర్పాటు చేసిన కాలనీలు మాయాబజార్ సినిమాను తలపించే మాదిరి తయారయ్యాయి. ఆ కాలనీల్లో లేనిది ఉన్నట్టు చూపించి లక్షల రూపాయలు దోచుకున్నారు. పేదలకు కేటాయించిన ఇళ్లను సొమ్ము చేసుకునేందుకు బిల్లులు పెట్టే అధికారులే ఇళ్లు కట్టినట్టి చూపించారు. వీటిపై తాడేపల్లిగూడెంలోని ఓ లే అవుట్‌లో ఆంధ్రజ్యోతి పరిశీలన చేయగా అధికారుల లెక్కలకు, వాస్తవానికి దూరంగా వున్నాయి. లబ్ధిదారులకు చెందాల్సిన ఐరన్, సిమెంట్ మెటీరియల్ దోచేందుకు ఒక పన్నాగమైతే.. లేని బిల్లులు పెట్టి సొమ్ములు లాక్కోవడం మరో ఎత్తుగడగా తెలుస్తోంది.

### ఆర్-3 లేఅవుట్‌లో ఇదీ వాస్తవం

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 1 : హౌసింగ్ అధికారులు వారి పరిపాలనా సౌలభ్యం కోసం లే అవుట్‌లకు పేర్లు పెట్టుకున్నారు. వాటిలో ఆర్-3 లే అవుట్ ఒకటి. ఇక్కడ అధికారుల లెక్కల్లో 79 ఇళ్లు పూర్తయినట్లు చూపించారు. కాని అక్కడ కట్టింది మాత్రం 49 మాత్రమే. వీటికితోడు రూఫ్ లెవల్, లింట్ లెవల్‌కు చేరిన ఇళ్లు అధికారిక లెక్క ప్రకారం 20. కాని, వాస్తవానికి 56 ఉన్నాయి. బేస్‌మెంట్ లెవల్‌లో ప్లింత్ భీమ్‌లు, బేస్‌మెంట్‌తో కలిసి వాస్తవంగా 183 అధికారిక లెక్కల్లో చూపిస్తుంటే వాస్తవానికి బేస్‌మెంట్‌కు చేరిన నిర్మాణాలు 189. బీబీఎల్ పేరుతో కొన్ని మొదలు పెట్టినవి, ఊచలు వేసినవన్ని కలిపి ప్రభుత్వ లెక్కల్లో 257 ఇళ్లను ఉంచితే ఇక్కడే అసలు లెక్క తప్పుతోంది. ఈ స్థాయిలో పెట్టిన వాటికి ఇసుక టోకెన్‌లు, ఐరెన్ టోకెన్‌లు, సిమెంటు టోకెన్‌లను నొక్కేందుకే ఈ లెక్క వచ్చిందంటూ విమర్శలు వస్తున్నాయి. వాస్తవంగా 560 స్థలాలకు గాను అసలు మొదలు పెట్టనివి 254 ఉండగా అధికారుల లెక్కల్లో నాలుగు స్థలాలు మాత్రమే చూపించడం విశేషం.

### బిల్లులు పెట్టే వారే ఇళ్లు కట్టారు

మున్సిపల్ కార్యాలయాల్లో వార్డు ఇమ్యూనిటీ సెక్రటరీలకే ప్రభుత్వం బిల్లులు పెట్టే అధికారం కట్టబెట్టింది. వారిపై హౌసింగ్ శాఖ సూపర్‌విజన్ చేయాలి. వైసీపీ ప్రభుత్వంలో భారీగా ఇళ్లు కట్టించాలనే ఆత్రుతను అలుసుగా తీసుకున్న వార్డు ఇమ్యూనిటీ సెక్రటరీలు కొందరు వారి పరిధిలోని ఇళ్లు కట్టేందుకు వారి బంధువుల పేరుతో కాంట్రాక్టర్లను సృష్టించి వారే ఇళ్లు కట్టినట్టు చూపించి వారి ఖాతాలకు బిల్లుల సొమ్ములు మళ్లించారు. దీంతోనే అసలు చిక్కు వచ్చిపడింది. లక్ష్యాలు చూపించేందుకు కొద్ది కొద్దిగా బిల్లులు చేసుకున్న ఆ సిబ్బంది అదే అలవాటుగా చేతివాటం చూపించారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో పేదల కాలనీలు కాస్తా వారి జేబులు నింపే నిధిగా మారాయి.

### అడుగడుగునా అక్రమాలే..

ఈ కాలనీల్లో ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఇచ్చే సొమ్ముతోపాటు లబ్ధిదారుడి వాటా రూ.35 వేలు కట్టించి వారితో ఇల్లు మొదలు పెట్టించాలి. అయితే లబ్ధిదారులను వారికి కేటాయించిన స్థలాల్లో నిలబెట్టి ఫొటో తీసి వారికి రావాల్సిన సిమెంటు, ఐరెన్, ఇసుక సామగ్రి వారికి కేటాయించినట్టు చూపించి ఆ మెటీరియల్‌ను తెగనమ్ముకున్నారు. వాటితోపాటు లబ్ధిదారుడి వాటాగా ఇచ్చే రూ.35 వేలు తమ వద్ద తీసుకుని బేస్‌మెంట్ నిర్మించలేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తరచూ ఈ తరహా గొడవలే లే అవుట్‌ల వద్ద దర్శనమిస్తున్నాయి.



దారి లేని రోడ్డు ఇదే

### దారులు కూడా లేని రోడ్లు..

ఈ లే అవుట్‌లలో రెండు వైపులా రాళ్లు పాతి రోడ్లు వేసినట్టు చూపించి బిల్లులు సొమ్ము చేసుకోవడం తప్ప రోడ్లు కూడా కనిపించడం లేదు. లక్షలాది రూపాయలు ఈ లే అవుట్‌లలో రోడ్లు వేసినట్టు చూపించినా ఈ లే అవుట్‌లలో ఇల్లు నిర్మించుకున్న వారు కనీసం నడిచి వెళ్లలేని పరిస్థితి. ఈ రోడ్లు చూసి ఇవేమి లే అవుట్‌లు తమకు నరకం చూపించేందుకే ఇక్కడ ఇళ్లు ఇచ్చారా అంటూ లబ్ధిదారులు వాపోతున్నారు.



ముంపులో జగనన్న కాలనీ.. అలాగే వెళుతున్న జనం

## వర్షం వస్తే ఇంతే

**»» మోగల్లు జగనన్న కాలనీ వాసుల అవస్థ**

పాలకోడేరు, ఆగస్టు 1: మోగల్లు జగనన్న కాలనీ వాసుల పాట్లు అన్నీ ఇన్నీ కావు. గత ప్రభుత్వం హడావుడిగా స్థలాలు ఇచ్చి, ఇళ్లు కట్టుకోవాలని ఒత్తిడి చేయడంతో కనీస మౌలిక సదుపాయాలు లేకపోయినా పెద్ద సంఖ్యలో అప్పులు చేసి మరీ కట్టుకున్నారు. అయితే ప్రభుత్వ పరంగా అక్కడ రహదారులు, డ్రెయిన్లు నిర్మించకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు కురిస్తే ఇళ్లల్లో నుంచి బయటకు వెళ్లలేరు. బయట వెళ్లి ఇంటికి రాలేరు అన్నట్టు తయారైంది. రాత్రి వేళల్లో విషసర్పాలు ఇళ్లల్లోకి వస్తున్నాయి. మోగల్లులో గొల్లలకోడేరు, గరగపర్రు, వేండ్ర, పాలకోడేరుకు చెందిన పలువురికి స్థలాలు ఇవ్వడంతో సొంత ఊళ్లను వదిలి ఇక్కడ ఇళ్లు కట్టుకున్నారు. ఇప్పుడు కురిసిన వర్షాలకు మరింత ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ప్రభుత్వం దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

## 97.23 శాతం పింఛన్లు పంపిణీ

భీమవరం టౌన్, ఆగస్టు 1: జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమం విజయవంతంగా సాగింది. ఉదయం ఆరు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు రెండు లక్షల 31 వేల 874 మంది లబ్ధిదారులకు గాను రెండు లక్షల 25 వేల 452 (97.23 శాతం) మందికి పింఛన్లు అందించారు. మిగిలిన ఆరు వేల 74 మందికి శుక్రవారం ఇస్తారు. జిల్లాలోని దాదాపు అన్ని మండలాల్లోను 95 నుంచి 98 శాతం వరకు నమోదైంది. ఎక్కడా సాంకేతిక ఇబ్బందులు తలెత్తలేదు. అన్ని నియోజకవర్గాల్లోనూ ప్రజా ప్రతినిధులు పింఛన్లు పంపిణీ చేశారు. పెనుమంట్ర మండలం ఆలమూరులో ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, భీమవరంలో ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు), టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి విస్సాకోడేరు, జక్కరంలలో ఉండి ఎమ్మెల్యే కె.రఘురామకృష్ణరాజు, నరసాపురంలో ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, టీడీపీ ఇన్‌ఛార్జ్ పొత్తూరి రామరాజు, తాడేపల్లిగూడెంలో ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, టీడీపీ ఇన్‌ఛార్జీ వలవల బాబ్జి, తణుకులో ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ పింఛన్లు పంపిణీ చేశారు. భీమవరంలోని ఓ వార్డులో పెన్షన్ల పంపిణీ ఆలస్యం కావడంతో కమిషనర్ ఎం.శ్యామల సంబంధిత ఉద్యోగులతో మాట్లాడి వెంటనే పెన్షన్ పంపిణీ చేపట్టారు. పూర్తి వివరాలు 8లో..

### వయో వృద్ధులకు ఆసరా

**»» కలెక్టర్ నాగరాణి**

ప్రభుత్వం వయోవృద్ధులు, దివ్యాంగులకు పెన్షన్ మొత్తాన్ని పెంచి ఆసరాగా నిలిచిందని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. గురువారం భీమవరం మారుతీ నగర్ ఏడో వార్డు లెప్రసీ కాలనీలో పింఛన్లు పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. లబ్ధిదారులతో ఆమె మాట్లాడుతూ లబ్ధిదారులు పింఛన్లను పొదుపు చేసుకొని అవసరాలకు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తొలుత కుష్టు వ్యాధిగ్రస్తులు, దివ్యాంగులకు రూ.6 వేల చొప్పున అందించారు. డీఆర్‌డీఏ పీడీ ఎంఎస్‌ఎస్ వేణుగోపాల్, మునిసిపల్ కమిషనర్ ఎం.శ్యామల, తదితరులు పాల్గొన్నారు.



వృద్ధురాలికి పింఛన్ అందించి, ఆమె యోగ క్షేమాలు తెలుసుకుంటున్న కలెక్టర్ నాగరాణి

### జిల్లాలో పెన్షన్ల పంపిణీ వివరాలివి

| మండలం | ఇచ్చిన పెన్షన్లు | శాతం |
|---|---|---|
| ఆకివీడు(అర్బన్) | 3,118 | 95.21 |
| యలమంచిలి | 10,034 | 96.17 |
| ఆచంట | 7,874 | 95.24 |
| పెనుగొండ | 8,533 | 96.47 |
| మొగల్తూరు | 10,356 | 96.49 |
| ఆకివీడు | 5,253 | 96.54 |
| కాళ్ళ | 8,650 | 96.78 |
| వీరవాసరం | 8,379 | 96.78 |
| ఉండి | 8,631 | 96.88 |
| గణపవరం | 8,550 | 96.93 |
| పెంటపాడు | 9,595 | 96.94 |
| పాలకోడేరు | 8,978 | 97.01 |
| తణుకు | 8725 | 97.17 |
| భీమవరం | 11,116 | 97.24 |
| నరసాపురం | 10,889 | 97.25 |
| అత్తిలి | 9,370 | 97.42 |
| పాలకొల్లు | 8,958 | 97.62 |
| తాడేపల్లిగూడెం | 12,320 | 97.68 |
| తణుకు(అర్బన్) | 8,392 | 97.79 |
| నరసాపురం(అర్బన్) | 5,621 | 97.84 |
| ఇరగవరం | 9,302 | 97.93 |
| పాలకొల్లు(అర్బన్) | 5,823 | 98.01 |
| భీమవరం(అర్బన్) | 11,099 | 98.06 |
| పోడూరు | 8,493 | 98.06 |
| పెనుమంట్ర | 8,227 | 98.08 |
| తాడేపల్లిగూడెం(అర్బన్) | 9,166 | 98.19 |
| మొత్తం | 2,25,452 | 97.23 |

# ఫలించిన కల



పెనుగొండ, ఆచంటలలో ఎమ్మార్పీఎస్ నాయకుల సంబరాలు

**• ఎస్సీల్లోని 58 ఉప కులాలకు న్యాయం**

ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్ జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు ప్రకటించాలని సుప్రీంకోర్టు తీర్పు హర్షణీయం. ఈ తీర్పుతో ఎస్సీల్లోని 58 ఉప కులాలకు న్యాయం జరుగుతుంది. విద్య, రాజకీయ, ఆర్థికంగా ఎస్సీ, ఎస్టీలు అభివృద్ధి చెందేందుకు ఈ తీర్పు ఎంతో ఉపయోగపడుతుంది. సీఎం చంద్రబాబు శాసనసభలో ఎస్సీలను ఏబీసీడీలుగా వర్గీకరణ చేసే విధంగా చట్ట బద్ధత కల్పిస్తారని ఆశిస్తున్నాం.

-కందుల రమేష్, ఎంఆర్‌పీఎస్ ఏలూరు జిల్లా అధ్యక్షుడు

**• మూడు దశాబ్దాలకు న్యాయం**

ఎస్సీల్లోని అన్ని ఉప కులాలకు న్యాయం జరగాలని మాదిగలు చేస్తున్న మూడు దశాబ్దాల శాంతియుత పోరాటానికి సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడం అభినందనీయం. సుప్రీం తీర్పుతో ఎస్సీలోని ఉపకులాల కుటుంబాల్లో వెలుగులు వచ్చాయి. ఎస్సీ వర్గీకరణకు ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు కట్టుబడి ఉండడం కలిసొచ్చే అంశం.

- పొలిమేర హరికృష్ణ, ఎంఆర్‌పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి

**• ఇది చంద్రబాబు పుణ్యమే**

నేడు ఎస్సీ వర్గీకరణ పుణ్యం సీఎం చంద్రబాబుదే. ఆనాడు చంద్రబాబు ఎస్సీ వర్గీకరణ చట్టం తీసుకురావడం వల్ల నేడు సుప్రీంకోర్టు తీర్పుతో మరోసారి ఎస్సీ వర్గీకరణకు మార్గం సుగమమైంది. ఈ వర్గీకరణ తీర్పు సమయంలో ఆయన ముఖ్యమంత్రి హోదాలో ఉండడం, వర్గీకరణ అమలు జరగడం తథ్యం.

- కొండేటి ఉదయ్‌కిరణ్(బాబి), ముసునూరు

**• సుదీర్ఘ పోరాటానికి ముగింపు**

ఎస్సీ వర్గీకరణ కోసం 30 ఏళ్ల సుదీర్ఘ పోరాటానికి సుప్రీం తీర్పుతో ముగింపు దొరికింది. ఈ తీర్పు వల్ల ఎస్సీ, ఎస్టీల్లోని ఉపకులాలకు విద్య, ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్ ఫలాలు అందుతాయి.

ఎం. రాము, ఎమ్మార్పీఎస్ నాయకుడు, భీమవరం

## ఎస్సీ వర్గీకరణకు వీలుగా సుప్రీం చారిత్రాత్మక తీర్పు

### జిల్లావ్యాప్తంగా ఎమ్మార్పీఎస్ సంబరాలు

**మాదిగ ఉప కులాలకు సరైన న్యాయం జరిగిందని హర్షామోదాలు**

**30 ఏళ్ల సుదీర్ఘ పోరాటానికి తెర.. మోదీ, చంద్రబాబుకు కృతజ్ఞతలు**

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ చేయాలని డిమాండ్ పుట్టింది మూడు దశాబ్దాల ముందే. అప్పటి నుంచి ఇప్పటి వరకు వివిధ వేదికలపై రాజకీయ పక్షాల ముందు ఎమ్మార్పీఎస్ పోరాటం సాగుతూనే వచ్చింది. ఇప్పుడున్న పరిస్థితుల్లో మాదిగలకు సరైన న్యాయం జరగాలంటే వర్గీకరణ ఒక్కటే మార్గమని మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి పుట్టింది. మాదిగ ఉప కులాలకు వర్తించే విధంగా రిజర్వేషన్లు అమలు కావాలన్నదే వారి ఆకాంక్ష. దీనికి తగ్గట్టుగానే అప్పట్లో సీఎంగా ఉన్న చంద్రబాబు వీరి వాదనలకు సమ్మతిని తెలిపారు. అయినా కేంద్రం నుంచి సానుకూలత లేకపోవడంతో అప్పట్లోనే సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సుదీర్ఘ న్యాయపోరాటం అనంతరం వర్గీకరణ చేసే అధికారం రాష్ట్రాలకు ఉండాలని సుప్రీం గురువారం నిర్దేశించింది. మాదిగ వర్గీకరణకు వీలుగా రిజర్వేషన్ల అమలు చేయాలంటూ ఎప్పుడో 30 ఏళ్ల క్రితమే ఒక అంశం తెర ముందుకు వచ్చింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఇదొక ఉద్యమంగా మారింది. రాయలసీమ జిల్లాల్లోను, తెలంగాణలోను ఉధృతమై మహోగ్రరూపం దాల్చింది. ఎలాగూ రిజర్వేషన్లు అమలవుతున్నాయి కాబట్టి మళ్లీ వర్గీకరణ ఏమిటంటూ అప్పట్లోనే కొందరు వాదనలకు దిగారు. ఎమ్మార్పీఎస్ ఆవిర్భావం, దానికి అధినేతగా ఉన్న మందకృష్ణమాదిగ ప్రతి రాజకీయ పార్టీని తమ డిమాండ్‌కు మద్దతు ఇవ్వాలని కోరుతూ వచ్చారు. ఆయన నేతృత్వంలోనే అప్పట్లోనే హైదరాబాదు నుంచి ఢిల్లీ వరకు రాజకీయ యాత్రలు సాగాయి. పోరాట స్ఫూర్తిని విస్తరించే క్రమంలో దీక్ష కూడా చేపట్టారు. ఇదంతా అటు మాదిగల్లోను, ఇటు రాజకీయ పార్టీల్లోను వేడి పుట్టించింది. ఎవరైతే మాదిగల పక్షాన వర్గీకరణకు అనుకూలంతా తమకు మద్దతు ప్రకటిస్తారో తమ మద్దతు వారికే ఉంటుందని ప్రకటించినట్టుగానే ఎంఆర్‌పీఎస్ రాజధాని నుంచి నియోజకవర్గ కేంద్రాలకు, అక్కడి నుంచి మండలస్థాయికి, గ్రామస్థాయి వరకు విస్తరించింది. ఎక్కడికక్కడ కమిటీలు ఏర్పడి ఏబీసీడీ వర్గీకరణకు సరికొత్త ఊపిరి పోశారు. ఇటీవల జరిగిన తెలంగాణలో జరిగిన ఎన్నికల్లో ప్రధాని నరేంద్రమోదీ మందకృష్ణ మాదిగను భుజం తట్టి మరీ సంఘీభావం ప్రకటించారు. దీంతో మాదిగ వర్గీకరణ పోరాటంలో ఆశలు రెట్టింపయ్యాయి. మూడు దశాబ్దాల కాలంలో ఎమ్మార్పీఎస్ పక్షాన పనిచేస్తున్న అనేక మందిపై కేసులు పెట్టారు. మరికొందరిని జైలులోకి నెట్టారు. అయినా మొక్కవోని ధైర్యంతో వర్గీకరణకు కట్టుబడి ఆ మేరకే పోరాటాన్ని కొనసాగిస్తూనే వచ్చారు. ఈ క్రమంలోనే వరుస సుదీర్ఘ విచారణల తర్వాత సుప్రీంకోర్టు వర్గీకరణకు సమ్మతిని తెలియజేస్తూ గురువారం అంతిమ తీర్పు ప్రకటించింది. దీనిపై అన్నిచోట్ల హర్షామోదాలు వ్యక్తమయ్యాయి. ఎస్సీ వర్గీకరణ వల్ల మాదిగ ఉప కులాలకు న్యాయం జరుగుతుందంటూ ఎమ్మార్పీఎస్ ప్రకటించింది. సుదీర్ఘ పోరాటం ఫలించిందని, దీనికి సుప్రీం తీర్పు ఆలంబన అని ప్రకటించింది.



**• అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం**

తాడేపల్లిగూడెం రూరల్ : ఎస్సీ వర్గీకరణపై సుప్రీం తీర్పును స్వాగతిస్తూ ఎమ్మార్పీఎస్ నాయకులు తాడేపల్లిగూడెంలో అంబేడ్కర్ విగ్రహానికి, ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. మాదిగ లాయర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు చెప్పుల వాసు మాట్లాడుతూ ఈ తీర్పు మూడు దశాబ్దాలపాటు ఉద్యమంలో పాల్గొని అసువులు బాసిన వారి త్యాగాల ఫలితమేనన్నారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి కొల్లి రాజశేఖర్, నాయకులు లంకా మోహనబాబు, బొల్లిపో రత్నాజి, తెన్నేటి జగజ్జీవన్ తదితరులు పాల్గొన్నారు.



తాడేపల్లిగూడెం, తణుకులలో సంబరాలు



## ఎమ్మార్పీఎస్ శ్రేణుల సంబరాలు

ఆచంట/పెనుగొండ/నరసాపురం టౌన్/తణుకు, ఆగస్టు 1 : ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును గౌరవిస్తూ గురువారం ఎమ్మార్పీఎస్ శ్రేణులు పెద్దఎత్తున సంబరాలు నిర్వహించారు. ఆచంట కచేరి సెంటర్‌లో ప్రధాని మోదీ, మందకృష్ణమాదిగ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లకు కృతజ్ఞతలు తెలిపి.. మంద కృష్ణమాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. నాయకులు కనపాల పెద్దిరాజు, కనపాల వెంకటేశ్వరరావు, తొత్తరమూడి శ్రీను, పలివెల పైడియ్య, దిగుమర్తి వెంకటేశ్వరరావు, చదలవాడ శరత్, పసుపులేటి చినబాబు, యార్లగడ్డ రత్నంరాజు పాల్గొన్నారు. పెనుగొండలో మంద కృష్ణమాదిగ చిత్రపటానికి ఎమ్మార్పీఎస్ శ్రేణులు పాలాభిషేకం చేశారు. తొలుత జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు కడిమి వెంకటేశ్వర్లు, గెద్దాడ చిన్న, తానేటి శేఖర్, ఉందుర్తి సతీష్‌కుమార్, తానేటి భాస్కర్‌కుమార్, దిగుమర్తి అక్షింతరావు, తానేటి బొనగియ తదితరులు పాల్గొన్నారు. నరసాపురంలో ఎమ్మార్పీఎస్ సంఘం జిల్లా అధ్యక్షుడు యర్లగడ్డ రత్న రాజు ఆధ్వర్యంలో గురువారం భారీ ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి.. మిఠాయిలు పంచిపెట్టారు. ఝాన్సీ లక్ష్మి, గరికపూడి జేమ్స్, జీవరత్నం, ఆశోక్ పాల్గొన్నారు. సుప్రీం తీర్పుతో మాదిగ జాతికి న్యాయం జరిగిందని తణుకు అరుంధతిపేట, మాదిగ యువత గురువారం సంతోషం వ్యక్తం చేసింది. ప్రధాని మోదీ, సీఎం చంద్ర బాబుకు వారు కృతజ్ఞతలు తెలిపారు. బిషప్ ఎం.జగ్జీవన్, సిర్రా బ్రహ్మయ్య, కె.యోహాను, యు.భరత్, ఎ.లాజరు, సి.సుధాకర్, యు.ప్రసన్న, డి.విద్యాసాగర్, ఎస్.ప్రసాద్ పాల్గొన్నారు.

# ఐపీఎస్‌కు భాను ప్రత్యూష

## ప్రస్తుతం ఏలూరు డిప్యూటీ కలెక్టర్‌గా విధులు



కాళ్ళ, ఆగస్టు 1 : పశ్చిమ గోదావరి జిల్లా కాళ్ళ మండలం సీసలి గ్రామానికి చెందిన గణేశ్న భాను శ్రీలక్ష్మీ అన్నపూర్ణ ప్రత్యూష ఐపీఎస్‌కు ఎంపిక య్యారు. ప్రత్యూష ఇటీవల వచ్చిన యూపీఎస్సీ ఫలితాలలో 198వ ర్యాంక్ సాధించి ఐపీఎస్‌కు ఎంపికయ్యారు. గత ఏడాది ఆగస్టులో విడుదలైన గ్రూప్ వన్ పరీక్షా ఫలితాలలో రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంక్ సాధించి ప్రస్తుతం ఏలూరు ప్రొబే షనరీ డిప్యూటీ కలెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. తాజాగా ఐపీఎస్‌కు ఎంపికవగా ఆగస్టు 26 నుంచి ముస్సోరిలో ఐపీఎస్ శిక్షణకు హాజరు కానున్నారు. కాళ్ళ మండలం సీసలి గ్రామానికి చెందిన రామాంజనేయులు, ఉషా దంపతులకు ఏకైక సంతానమైన ప్రత్యూష మొదట నుంచి చదువుపై ఉన్న ఆసక్తి, ఉన్నత స్థానాలకు వెళ్లాలనే సంకల్పంతో కష్టపడి చదివి సివిల్స్‌లో ర్యాంక్ సాధించిందన్నారు. తల్లి గృహిణి కాగా, తండ్రి ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పని చేస్తూ ప్రస్తుతం భీమవరం డీఈవో ఆఫీస్‌లో ఏపీవోగా పనిచేస్తున్నారు. ప్రత్యూషను గ్రామస్థులు అభినందించారు.

### ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు అర్బన్, ఆగస్టు 1 : డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి పురస్క రించుకుని రాష్ట్ర ప్రభుత్వం అందజేసే రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ/ ఎస్ఎఫ్‌టీ డబ్ల్యు, అవార్డులకు జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో పని చేస్తున్న హెచ్‌ఎంలు, టీచర్లు, టీచర్ ఎడ్యుకేటర్‌ల నుంచి దరఖాస్తులను ఆహ్వాని స్తున్నట్టు డీఈవో ఎస్.అబ్రహం ఓ ప్రకటనలో తెలిపారు. పురస్కారాలకు అర్హతల వివరా లను deoeluru.org వెబ్‌సైట్‌లో పొందుపర్చామన్నారు.దరఖాస్తు నమూనా లను సంబంధిత విద్యాశాఖ తనిఖీ అధికారుల నుంచి పొందాలని సూచించారు. ఈనెల 5 నుంచి 9వ తేదీ సాయంత్రం 4 గంటల్లోగా సంబంధిత తనిఖీ అధికా రుల ద్వారా ఏలూరు డీఈవో కార్యాలయంలో దరఖాస్తులు అందించాలన్నారు.



పతకాలు సాధించిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ తదితరులు

### గురుకుల విద్యార్థులకు పతకాల పంట

పెదవేగి, ఆగస్టు 1 : పెదవేగిలోని డాక్టర్ అంబేడ్కర్ గురుకుల విద్యార్థులు క్రీడల్లో ప్రతిభతో పతకాలు సాధించారు. జూలై 27, 28 తేదీలో కర్నూలు జిల్లా నంద్యాలలో జరిగిన రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో ఆరుగురు విద్యార్థులు పతకాలు సాధించారని గురుకుల విద్యాలయం ప్రిన్సిపాల్ ఎం.వెంకటేశ్వరరావు చెప్పారు. క్రీడాపోటీల్లో ఏడుగురు జంప్‌రోప్‌లో పాల్గొనగా రెండు బంగారు, నాలుగు కాంస్య పతకాలను సాధించారని తెలిపారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ వైవీఎస్ ఆచార్యులు, పీడీ కె.జయరాజు, పీఈటీ పి.గురుమూర్తి, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మొత్తం ఏడుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడల్లో పాల్గొనగా రంజిత్‌కుమార్, దుర్గదీప్‌లు బంగారు పతకాలు సాధించారని చెప్పారు. అమితేష్, సతీష్, అభిలాష్, రాకేష్ నలుగురు కాంస్య పతకాలను అందుకున్నారన్నారు. వీరిలో ముగ్గురు మహారాష్ట్రలోని నాందేడ్‌లో జరగబోయే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు.

### త్వరలోనే రైతులకు ధాన్యం బకాయి సొమ్ములు

భీమవరం రూరల్, ఆగస్టు 1 : రబీ సీజన్‌లో 71,446 మంది రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేశామని, ఇప్పటివరకు 976 కోట్ల 41 లక్షలు జమ చేశామని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు తెలిపారు. సోమవారం ఆంధ్రజ్యోతిలో ధాన్యం డబ్బులు ఇవ్వాలంటూ ధర్నా వార్తపై వివరణ ఇచ్చారు.ఇంకా జిల్లాలో 424 కోట్ల 33 లక్షలు ఇవ్వవలసి ఉందని తెలిపారు. ప్రభుత్వం నిధులు విడుదల చేసిన తరువాత రైతుల ఖాతాల్లో జమ చేస్తామన్నారు.



### స్నేహితురాలి ప్రాణం కోసం..

ఏలూరు రూరల్, ఆగస్టు 1: వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న ఉద్యోగిని కుమార్తె ప్రాణాపాయ స్థితిలో ఉంది. ఏలూరు ఒక పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న జ్ఞానేశ్వరికి (14) లివర్ మార్పిడి జరగాల్సి ఉంది. ప్రస్తుతం ఆమె విజయవాడ ఆంధ్రా ఆసుపత్రిలో ఐసీయూలో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతోంది. ఆపరేషన్‌కు రూ.25 లక్షలు ఖర్చవుతోంది. చికిత్సకు అవసరమైన ఆర్థిక స్తోమత లేకపోవడంతో ఆమె స్నేహితురాళ్లు సాయం కోసం ముందుకు వచ్చారు. ప్రముఖ నాట్యాచారిణి స్వర్ణలత ఆధ్వర్యంలో పురవీధుల్లో ప్రతి ఇంటికి వెళ్లి ఆర్థిక సాయం అర్థించారు.

### ఏలూరు ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా సుధాకర్, ఆర్ఎంవోగా దుర్గాకుమార్



సుధాకర్,కుమార్‌లకు సత్కారం



ఏలూరు క్రైం, ఆగస్టు 1: ఏలూరు ప్రభుత్వా సుపత్రి మెడికల్ సూపరిం టెండెంట్‌గా జనరల్ మెడిసిన్ హెచ్‌వోడీ సీహెచ్ సుధాకర్ బాధ్య తలు చేపట్టారు. ఇప్పటి వరకూ మెడికల్ సూప రింటెండెంట్‌గా ఉన్న డాక్టర్ అగ్నస్ విజయ జూలై 31వ తేదీన ఉద్యోగ విరమణ చేశారు. దీంతో డాక్టర్ సుధాకర్‌ను నియ మించారు. ఇప్పటివరకూ ఆసుపత్రి ఆర్ఎంవోగా ఉన్న డాక్టర్ ప్రసాద్‌రెడ్డి స్వచ్ఛందంగా విధుల నుంచి తప్పుకోవడంతో ఆయన స్థానంలో ఆసుపత్రి కమ్యూనిటీ మెడిసిన్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ దుర్గాకుమార్‌ను నియ మించారు. దుర్గాకుమార్ గతంలో కామయ్యపాలెం పీహెచ్‌సీ వైద్యులుగా పని చేశారు. అనంతరం సిద్ధార్థ మెడికల్ కాలేజీ విజయవాడ, నెల్లూరులో కూడా పనిచేస్తూ అసోసియేట్ ప్రొఫెసర్‌గా ఏలూరు ప్రభుత్వాసుపత్రి మెడికల్ కాలేజీలో చేరారు. గతంలో ఏలూరు ప్రభుత్వాసుపత్రిలోనూ, ఏలూరు ఎంహెచ్‌వోగాను పని చేశారు. దీంతో ఆయనను ఆసుపత్రి రెసిడెన్సి మెడికల్ ఆఫీసర్‌గా నియమించారు. దుర్గాకుమార్‌ను క్లాస్ ఫోర్ ఉద్యోగుల నాయకులు లక్ష్మణకుమార్, దాసు, హరి బాబు పలువురు దుశ్శాలువా, పూలమాలలతో సన్మానించారు. మెడికల్ సూపరిం టెండెంట్ డాక్టర్ సుధాకర్‌ను ఆసుపత్రి అత్యవసరపు వైద్యులు డాక్టర్ సుమన్, డాక్టర్ మొబీనా, డాక్టర్ రేష్మాలు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.


### ఆధార్ వేలిముద్రలతో రూ.30 వేలు కొట్టేశారు..

#### తిరిగి అకౌంట్‌లోకి రప్పించిన సైబర్ క్రైం పోలీసులు

ఏలూరు క్రైం, ఆగస్టు 1 : సైబర్ నేరగాళ్ళు ఆధార్ వేలిముద్రలు ద్వారా బ్యాంకు అకౌంట్‌లో ఉన్న నగదును అపహరించడంతో బాధితుడు సైబర్ టోల్ ఫ్రీనెంబర్ 1930కు ఫిర్యాదు చేశాడు. సైబర్ క్రైం పోలీసులు రంగంలోకి దిగి బాధితుడి అకౌంట్ నుంచి అపహరణకు గురైన సొమ్మును తిరిగి రప్పించారు. దీంతో బాధితుడు జిల్లా ఎస్పీ కిషోర్‌కు కృతజ్ఞతలు తెలిపాడు. పెదవేగి మండలం కవ్వగుంట గ్రామానికి చెందిన ఉమామహేశ్వరరావుకు ఏలూరు స్టేట్ బ్యాంక్‌లో సేవింగ్స్ అకౌంట్ ఉంది. అతని ఆధార్‌కార్డు అథెంటికేషన్ ద్వారా అతనికి తెలియకుండా రూ.30 వేలు అకౌంట్ నుంచి గుర్తు తెలియని వ్యక్తులు డ్రా చేశారు. దీంతో బాధితుడు సైబర్ సెల్‌కు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారు. అపహరణకు గురైన సొమ్మును తిరిగి తన అకౌంట్‌కు రప్పించారు.



# గ్రీన్ ట్యాక్స్ మోత






## దడ పుట్టిస్తున్న హరిత పన్ను

## పక్క రాష్ట్రాల్లో వందల్లో.. ఇక్కడ వేలల్లో

## గగ్గోలు పెడుతున్న వాహన యజమానులు

## కూటమి హామీ నెరవేర్చాలని డిమాండ్

పాలకొల్లు, ఆగస్టు 1: జగన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో చేసిన అరాచకాలు రాష్ట్ర ప్రజలను వెంటాడుతూనే ఉన్నాయి. ఒకటి, రెండూ కాదు అన్ని రంగాలను ఒక ఆట ఆడిన జగన్ ప్రభుత్వం చీడ ఇప్పటికీ వాహన యజ మానులను వెంటాడుతూనే ఉన్నది. రవాణా వాహనాలకు, పాసింజర్, సొంత వాహనాలకు వివిధ రూపాల్లో హరిత పన్ను (గ్రీన్ ట్యాక్స్) వసూలు చేస్తారు. వాస్తవానికి ఈ పన్ను వసూలు విధానం కేంద్ర ప్రభుత్వానిది. అయితే దేశంలోని ఆయా రాష్ట్రాలు హరిత పన్నును తమ పరిస్థితుల మేరకు పన్ను వసూళ్లను మదింపు చేస్తుంటాయి. కాలం తీరిన వాహనాల నుంచి వచ్చే కర్బన ఉద్గారాలు (కార్బండయాక్సైడ్) శాతం పెరుగుతుండటాన్ని బట్టి గ్రీన్ ట్యాక్స్ పెరుగుతూ ఉంటుంది. గూడ్స్ వెహికల్స్, పాసింజర్ వెహికల్స్‌కు కొనుగోలు రిజిస్ట్రేషన్ తేదీ నుంచి ఎనిమిదేళ్ల తరువాత పన్ను చెల్లించాల్సి ఉంటుంది. సొంత వాహనాలకు అయితే కొనుగోలు రిజిస్ట్రేషన్ అనంతరం 15 ఏళ్ల వరకూ గ్రీన్ టాక్స్ చెల్లించాల్సిన అవసరం లేదు.

> సమీప రాష్ట్రాలలో గ్రీన్ టాక్స్ రూ. 500 నుంచి 1500 మాత్రమే ఉండగా, ఆంధ్రప్రదేశ్‌లో రూ. 6 నుంచి 9 వేలు వరకూ ఉంది. కొన్ని ఉత్తరాది రాష్ట్రాలలో సైతం హరిత పన్ను అధికంగా వసూలు చేస్తున్న ప్పటికీ దేశంలోని అధికశాతం రాష్ట్రాలలో సరళంగానే ఉంది. మన రాష్ట్రంలో మాత్రం జగన్ రెడ్డి ప్రభుత్వానికి ముందు వందల్లో ఉన్న గ్రీన్ టాక్స్ ఇప్పుడు వేలల్లోకి పెరిగింది.

### కూటమి హామీ నెరవేర్చాలి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే హరిత పన్ను తగ్గిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే వాహన రంగం తగిన కిరాయిలు లేక కుదేలైన పరిస్థితుల్లో గ్రీన్ ట్యాక్స్, రోడ్ ట్యాక్స్, ఫిటెనెస్, వీటికి తోడు టోల్ ట్యాక్స్‌లు, నిర్వహణ వ్యయం..ఇవన్నీ రవాణా వాహనాల ఉనికిని ప్రశ్నిస్తున్నాయి. ఇప్పటికే రాష్ట్రంలోని వందల సంఖ్యలో ట్రాన్స్‌పోర్టు వాహనాలను ఇతర రాష్ట్రాలలో అమ్మకాలు జరిపారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఎన్నికల సమయంలో నేరుగా వాహన యజమానులకు హామీ ఇచ్చారని, రాష్ట్రంలో గ్రీన్ ట్యాక్స్ వేలల్లో ఉండటం పట్ల విస్మయం వ్యక్తం చేశారని తాము అధికారంలోకి వచ్చిన వెంటనే పెంచిన ట్యాక్స్ తగ్గిస్తామని హామీ ఇచ్చినట్టు ఈ సందర్భంగా వాహన యజమానులు గుర్తు చేస్తున్నారు


#### రవాణా రంగాన్ని ఆదుకోవాలి



గడచిన సార్వత్రిక ఎన్నికల్లో కూటమికి అసోసియేషన్ నేరుగా మద్దతు ఇచ్చింది. వివిధ రూపాలలో అధికంగా వసూలు చేస్తున్న పన్నులను తక్షణం తగ్గించాలి. ప్రభుత్వం డీజిల్, పెట్రోల్ ధరలను కూడా 10 నుంచి 20 శాతం తగ్గిస్తే రవాణా రంగం కష్టాల నుంచి గట్టెక్కుతుంది.

**- టిప్పర్ లారీ యజమానులు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రావూరి రాజా**

# వామ్మో.. ఇలా అయితే కష్టమే !



## సిలబస్ మార్చాల్సిందే..

## ఒక్కో పాఠ్యాంశం 14 పేజీలా ?

## ఐఏఎస్‌ల మాదిరిగా 9, 10 తరగతుల పిల్లలకు పాఠాలేమిటి ?!

## 'పది' పరీక్షల మీడియంపై స్పష్టతేదీ ?

## కొత్త పాఠ్య పుస్తకాలపై పునశ్చరణ తరగతుల్లో టీచర్ల అభ్యంతరాలు

ఏలూరు అర్బన్, ఆగస్టు 1 : హైస్కూలు విద్యార్థులకు ముచ్చెమటలు పుట్టించేలా 9,10 తరగతులకు ఈ ఏడాది నుంచి ప్రవేశపెట్టిన నూతన సిలబస్ పాఠ్యాంశాలున్నాయి. జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా కేంద్ర మానవ వనరుల శాఖ అనుబంధ సంస్థ ఎన్‌సీఈఆర్‌టీ అందజేసిన నూతన సిలబస్ 9,10 తరగతుల పాఠ్యపుస్తకాలనే యదాతథంగా రాష్ట్రాలకు పంపిణీ చేసింది. వాటిలో పాఠ్యాంశాలను పరిశీలిస్తే ఐఏఎస్ వంటి జాతీయ స్థాయి ఉన్నత విద్య గ్రంథాల మాదిరిగా ఉన్నాయని ఉపాధ్యాయులే అభి ప్రాయం వ్యక్తం చేస్తున్నారు. నూతన పాఠ్యపుస్తకాలపై సంబంధిత తరగతుల సబ్జెక్టు టీచర్లకు పునశ్చరణ తరగతులు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. ఒక్కో పాఠ్యాంశం 13-15 పేజీలు పైబడి ఉండటాన్ని, మరీ కఠినంగా రూపొందించడాన్ని ఉపాధ్యాయులు ఓరియంటేషన్ తర గతుల్లో నేరుగానే అభ్యంతరాలను లేవనెత్తారు. ఈ ఏడాది నుంచి పదో తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షలు ఆంగ్ల మాధ్యమంలోనే రాయాలంటూ గతంలో వైసీపీ ప్రభుత్వం జారీచేసిన మౌఖిక ఆదేశాల ప్రకారం కొత్త సిలబస్‌తో పరీక్షలు రాయలేరన్న ఏకాభిప్రాయం వ్యక్తమైంది. ఏ మాధ్య మంలో పది పరీక్షలు రాయాలన్నదానిపై కూటమి ప్రభుత్వం ఇంత వరకు ఎటువంటి అధికారిక నిర్ణయాన్ని వెలువరించకపోవడాన్ని కూడా పునశ్చరణ తరగతుల్లో పలువురు టీచర్లు ప్రస్తావించారు. జాతీయస్థాయిలో హిందీ అధికారిక భాషగా వున్న రాష్ట్రాలకు అనుగుణంగా రూపొందించుకున్న నూతన సిలబస్‌ను తెలుగు మాతృభాషగా వున్న ఏపీపై బలవంతంగా రుద్దడంపై కొందరు ఉపాధ్యాయులు అభ్యంతరం వ్యక్తం చేశారు. కొత్తగా ప్రవేశ పెట్టిన 9,10 తరగతులకు సంబంధించి హిందీ, ఇంగ్లీషు, సోషల్ స్టడీస్ సబ్జెక్టుల పాఠ్యపుస్తకాల సిలబస్ చాలా కఠినంగా ఉందని వీటిని విద్యార్థులకు సులువుగా బోధించడం చాలా కష్ట సాధ్యమని ఉపాధ్యాయులు తేల్చిచెప్పారు. ఆంగ్ల మాధ్యమంలో వున్న ఈ కఠినతరమైన సిలబస్‌తో కూడిన పాఠాలను చదివి విద్యార్థులు పరీక్షలు రాయడమంటే వారిపై మోయలేని భారాన్ని మోపడమేనని, ఇప్పటివరకు తెలుగు మాధ్యమంలో 9వ తరగతి చదివి ఇపుడు పదోతరగతి పాఠ్యాంశాలను ఆంగ్ల మాధ్యమంలో చదివి, అర్థం చేసుకుని రాయాల్సి రావడం చాలా కష్టంగా ఉంటుందని చెప్పారు. సబ్జెక్టు టీచర్లు లేవనెత్తిన అభ్యంతరాలపై డీసీఈబీ కార్యదర్శి సర్వేశ్వరరావును వివరణ కోరగా ప్రధానంగా మూడు సబ్జెక్టుల సిలబస్ బోధన చాలా కష్టసాధ్యంగా ఉందని ఉపాధ్యాయులు చెప్పారు. పాఠ్యాంశాల నిడివిని కుదించాలని హిందీ, సోషల్ స్టడీస్ టీచర్లు సూచనలు చేశారు. "శుక్రవారం ఇంగ్లీషు సబ్జెక్టు టీచర్లకు పునశ్చరణ తరగతులుంటాయి. మిగతా సబ్జెక్టులకు వెబెక్స్ విధానంలో నిర్వహిస్తాం. సిలబస్ భారం, బోధనలో సమస్యలు, విద్యార్థుల ఎదుర్కొనే క్లిష్టతలపై కొందరు టీచర్లు లేవనెత్తిన అభ్యంతరాలను ఎస్‌సీఈఆర్‌టీకి తెలియజేయడం మినహా జిల్లా స్థాయిలో మేమేం చేయలేం. నిర్ణీత షెడ్యూల్ ప్రకారం టీచర్లకు ఓరియం టేషన్ క్లాసుల నిర్వహణ వరకే మా బాధ్యత.' అని డీసీఈబీ కార్యదర్శి వివరించారు.

# తాకట్టు.. లోగుట్టు..!





## లక్షల విలువ చేసే ఆభరణాలు తాకట్టు పెట్టినా రశీదు ఇవ్వరు

## వ్యాపార నిబంధనలకు తూట్లు

## కొరవడిన అధికారుల పర్యవేక్షణ

నరసాపురం, ఆగస్టు 1: ఉభయగోదావరి జిల్లాల్లో నరసాపురం బంగారం, తాకట్టు వ్యాపారానికి పెట్టింది పేరు.నిత్యం కోట్లల్లో వ్యాపారం జరుగుతుంది, చాలామంది తమ అవసరాలకు ఇక్కడి వ్యాపారుల వద్ద బంగారు వస్తువులు తాకట్టు పెట్టి అప్పులు తీసుకోవడం అనవాయితీగా వస్తున్నది. బ్యాంకుల ఇచ్చే రుణం కంటే ఇక్కడి వ్యాపారులు ఎక్కువ మొత్తంలో అప్పు ఇస్తుండమే ఇందుకు కారణం. జిల్లాలో ఎక్కడా లేనన్ని తాకట్టు దుకాణాలు పట్టణంలో ఉన్నాయి. దాదాపు 100కు పైగా షాపులు ఉన్నాయి. ఈ వ్యాపారం చేసేందంతా ఉత్తరాది ప్రాంతానికి చెందిన మార్వాడీలే.

### అప్పు ఎంతైనా ఇస్తారు.. రశీదు ఉండదు

ప్రభుత్వం జారీచేసిన లైసెన్స్‌కు అనుగుణంగా ఇక్కడి వ్యాపారులు తాకట్టు వ్యాపారం చేయడం లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. దీనికి ఉషారాణి సంఘటన బలం చేకూర్చినట్లైయింది. గడిచిన రెండేళ్లుగా ఈమె 20 సార్లుపైనే వివిధ వస్తువుల్ని తాకట్టు పెట్టింది. అయితే ఒక్కసారి కూడా వ్యాపారి రశీదు ఇవ్వలేదు. లక్షలు విలువ చేసే వస్తువులు తాకట్టు పెట్టినా వాటికి సంబంధించిన ఎటువంటి రశీదు ఇవ్వకపోవడం వల్ల కొన్ని సమ యాల్లో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ప్రస్తుతం వెలుగుచూసిన ఉషారాణి సంఘటన కూడా ఇలాంటిదే. గతంలో ఇలాంటి సంఘటనలు ఎన్నో మార్కె ట్‌లో వెలుగుచూశాయి. వాటిని వ్యాపారులు బయటకు పొక్క నివ్వలేదు. కొందరు కస్టమర్లు తాకట్టు పెట్టిన దుకాణం వివరాలను కుటుంబ సభ్యులకు చెప్పకుండా దాచిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఇలాంటి సమయంలో ఆ కస్టమర్ హఠాత్తుగా మరణిస్తే ఆ వస్తువులు విడిపించుకోవడం కుటుంబ సభ్యులకు పెద్ద సమస్యగా మారుతుంది. రశీదు లేకపోవడం వల్ల వ్యాపారి తన దగ్గర తాకట్టు పెట్టలేదని చెప్పితే ఏమీ చేయలేని పరిస్థితి. అయితే ఈవ్యాపారమంతా నమ్మకం మీదే సాగుతోంది. కస్టమర్‌పై నమ్మకంతో ఆభరణాల విలువతో సమానంగా అప్పు ఇస్తున్నారు. ఇదే నమ్మకంతో కస్టమర్ కూడా బిల్లు తీసుకోవడం లేదు. అయితే తాకట్టు నిబంధనల ప్రకారం వ్యాపారి కచ్చితంగా రశీదు ఇవ్వాలి. ఇక్కడ ఈ నిబంధనలను కొందరు వ్యాపారులు పాటించడం లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఆదాయ పన్ను తప్పించుకునేందుకే రశీదులు ఇవ్వరన్న వాదనలు వినిపి స్తున్నాయి. ప్రస్తుతం బంగారం విలువ భారీగా పెరిగింది. కనీసం కాసు వస్తువు తాకట్టు పెడితే రూ.30 వేలు వరకు అప్పు ఇస్తారు. ఇలా రోజుకు కొన్ని లక్షల రూపాయలు వ్యాపార లావాదేవీలు జరుగుతున్నాయి. కానీ ఎక్కడా రశీదులు ఇచ్చిన దాఖలాలు కనిపించడం లేదు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్లే కొందరు వ్యాపారులు నిబంధనలను పాటిం చడం లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి.

# పింఛన్ల పంపిణీకి వచ్చి..వెళ్లిపోయారు

## ఎమ్మెల్యే బాలరాజు తీరుతో స్థానిక నాయకుల్లో అయోమయం

బుట్టాయగూడెం, ఆగస్టు 1 : పింఛన్లు పంపిణీ చేసేందుకు వచ్చిన ఎమ్మెల్యే అకస్మాత్తుగా వెనుతిరిగి వెళ్లిపోవడంతో అక్కడ ఉన్నవారంతా విస్మ యానికి గురయ్యారు. బుట్టాయగూడెం మండలం కృష్ణాపురంలోని ముది రాజ్‌పేట, తెల్లంవారిగూడెం, దొరమామిడి ప్రాంతాల్లో అర్హులకు ఎమ్మెల్యే చిర్రి బాలరాజు పింఛన్లు అందజేస్తారని కార్యాలయం వర్గాలు బుధ వారం రాత్రి నుంచే వారి అధికారిక గ్రూపుల్లో మెసేజ్‌లు పెట్టారు. ఈ కార్య క్రమంలో కూటమి నేతలంతా పాల్గొనాలని కోరారు. ఎమ్మెల్యే వస్తారని అధికారులు, సచివాలయం సిబ్బంది అంతా సిద్ధం చేశారు. ఎమ్మెల్యే చేతుల మీదుగా పింఛన్లు తీసుకోడానికి పేదలు కూడా ఎదురు చూస్తున్నారు. ప్రకటించినట్టుగానే గురువారం ఉదయం ఎమ్మెల్యే కృష్ణాపురం చేరుకు న్నారు. కారణం తెలియదుకాని పది నిమిషాలు గడవకముందే వెనుతిరిగి వెళ్లిపోయారు. అక్కడున్న నాయకులకు ఎమ్మెల్యే ఎందుకు వెళ్లిపోయారో తెలియక తికమక పడ్డారు. కార్యక్రమానికి వచ్చిన కొద్దిమంది కూటమి నాయకులు పింఛన్లు పంపిణీ చేశారు. స్థానిక జనసేన నాయకులకు సమాచారం ఇవ్వక పోవడంతో ఈ కార్యక్రమానికి హాజరు కాలేదు. దీంతో చేసేది లేక ఎమ్మెల్యే వెనుతిరిగి వెళ్లిపోయినట్లు తెలిసింది. ఇదే విషయాన్ని ఎమ్మెల్యే బాలరాజును ఆంధ్రజ్యోతి అడగ్గా స్థానిక నాయకులకు సమాచారం లేనందున మనస్పర్ధలు రాకుండా ఉండాలని వెళ్లిపోయినట్లు తెలిపారు.

### పాలకొల్లులో ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్ నెలకొల్పాలి

#### ప్రభుత్వానికి చేగొండి హరిరామ జోగయ్య లేఖ

పాలకొల్లు, ఆగస్టు 1 : రాష్ట్రంలో సినీ పరిశ్రమ మరింతగా అభివృద్ధి చెందేందుకు ఉభయ గోదావరి జిల్లాలకు అనుకూలంగా ఉండే పాలకొల్లులో మెగా ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌ను నెలకొలాలని సినీ నిర్మాత, మాజీ ఎంపీ చేగొండి వెంకట హరి రామజోగయ్య రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. ఈ విషయాన్ని గురువారం విలేకర్లకు తెలియజేశారు. స్కిల్ డెవలప్‌మెంట్‌లో భాగంగా సినీ పరిశ్రమలో ముఖ్యమైన అనుబంధ విభాగాల్లో శిక్షణ ఇస్తే ప్రయోజనకరంగా ఉంటుందని లేఖలో పేర్కొన్నారు. కళలకు పుట్టినిల్లుగా పిలువబడే పాలకొల్లులో ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్ నెలకొల్పాలని దీనికి ఎస్వీ రంగారావు పేరు పెట్టాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, పర్యాటక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్‌లకు లేఖ పంపి నట్టు జోగయ్య తెలిపారు.



రోడ్డుపైనే నిలిచిపోయిన మురుగునీరు

### ఆలమూరులో జ్వరాలు

#### వైద్య శిబిరం ఏర్పాటు చెయ్యాలని ఎమ్మెల్యే ఆదేశం

పెనుమంట్ర, ఆగస్టు1 : పెనుమంట్ర మండలం ఆలమూరులో ఏ ఇంట చూసినా జ్వర పీడుతులే.. వారం రోజులుగా విష జ్వరాలు వ్యాపించడంతో ఆలమూరులో బెంబేలెత్తిపోతున్నారు. గ్రామాల్లో పేరుకుపోయిన చెత్తా చెదారం, కంపు కొడుతున్న రహదారుల కారణంగా వైరల్ జ్వరాలు ప్రబలు తున్నాయి.. వైద్య ఆరోగ్యశాఖ అధికారులు మాత్రం మొక్కుబడిగా సర్వేలు చేసి చేతులు దులుపుకుంటున్నారు. జ్వరం వచ్చిన వారు డెంగీ జ్వరాల భయంతో ఆసుపత్రులకు పరుగులు పెడుతున్నారు. ఆలమూరులో మాత్రం ఒక్క డెంగీ కేసు మాత్రమే నమోదైందని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్య సేవలు అందించామని ఆలమూరు పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ ప్రదీప్ చెబుతున్నారు. ఇదిలా ఉంటే ఆలమూరు గ్రామానికి ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీకి విచ్చేసిన ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ వైద్య సేవలపై ఆరా తీశారు గ్రామంలో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వైరల్ జ్వరాలు వస్తున్నాయని డెంగీ జ్వరాలుగా భావించి ప్రజలు ఆందోళన చెందుతున్నారని డాక్టర్ ప్రదీప్ చెప్పారు..

## క్రైం కార్నర్

### పట్టపగలు రెండు ఆక్వా దుకాణాల్లో చోరీ

ఆకివీడు, ఆగస్టు 1 : ఆకివీడులో స్టేట్ బ్యాంకు సమీపంలో పట్టపగలు రెండు ఆక్వా దుకాణాల్లో చోరీ జరిగింది. రోజులాగానే రాజ్యలక్ష్మీ, ధనలక్ష్మీ ఆక్వా మేత దుకాణాల గుమస్తాలు గ్లాస్ డోర్‌లు వేసి భోజనాలకు వెళ్లారు. తిరిగి వచ్చేసరికి తలుపులు తీసి ఉండడంతో పాటు సురుగులో ఉండాల్సిన నగదు కనబడలేదు. సీసీ కెమెరాలు పరిశీలించగా మెడలో కండువా వేసు కొని ఒక వ్యక్తి అటూ ఇటూ తిరుగుతుండగా అప్పుడే స్కూటీపై ఒక వ్యక్తి వచ్చి తాళాలు వేసి ఉన్న గ్లాస్ డోర్‌లు లివర్‌తో ఓపెన్ చేసి లోపలికి వెళ్లాడు. రాజ్యలక్ష్మీ ఆక్వా దుకాణంలో రూ.14 వేలు, ధనలక్ష్మీ ఆక్వా దుకా ణంలో రూ.30 వేలు నగదు దొంగిలించినట్లు షాపు నిర్వాహకులు తెలుపు తున్నారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వచ్చి పరిశీలించి వెళ్లారు. విచారణ అనంతరం కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.

### భీమవరంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి



భీమవరం క్రైం, ఆగస్టు 1 : భీమవరం పట్టణంలో బైపాస్ రోడ్డులో గ్రంధి వెంకటేశ్వరరావు జూనియర్ కళా శాల దాటిన తరువాత పుంత రోడ్డులో ఒక గుర్తు తెలి యని వ్యక్తి మృతదేహం కనిపించింది.వయసు సుమారు 65 సంవత్సరాలు ఉంటుంది. జారిపడిపోయి కింద తలకి గాయం అయి చనిపోయి ఉండవచ్చని భావిస్తున్నారు. వీఆర్వో ఇచ్చిన ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు తెలిస్తే ఎస్ఐ 94407 96633 నంబర్‌కు తెలియజేయాలని కోరారు.

### ఏలూరు రైల్వే గేటు వద్ద..

ఏలూరు క్రైం, ఆగస్టు 1 : ఏలూరు రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఏలూరు నిమ్మకాయల మార్కెట్ యార్డు రైల్వే గేటు వద్ద ఒక గుర్తు తెలి యని మృతదేహం ఉన్నట్లు సమాచారం అందడంతో రైల్వే ఎస్ఐ సైమన్ వెళ్లి పరిశీలించారు. మృతుడు సుమారు 30 నుంచి 35 ఏళ్ల వయసు కల్గి, 5.8 అడుగుల ఎత్తు ఉన్నాడు. ఆలివ్ గ్రీన్ రంగు పొట్టి చేతుల టీషర్టు, ఆకుపచ్చ రంగు లోయరు ధరించి ఉన్నాడు. రైలు నుంచి జారిపడ్డాడా లేదా మరేదైనా ప్రమాదం వల్ల మరణించాడా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృత దేహానికి పోస్టు మార్టం నిమిత్తం ఆసుపత్రి మార్చురీకి తరలించారు.వివరాలు తెలిసిన వారు రైల్వే ఎస్ఐ నంబర్ 99892 19559కు సమాచారం అందించాలని కోరారు.

### వివాహిత ఆత్మహత్య

ఏలూరు క్రైం, ఆగస్టు 1 :కారణం తెలియదు కాని ఒక వివాహిత పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. లింగపాలెం మండలం కొత్తపల్లికి చెందిన మౌనిక (34)కు టి.నర్సాపురం మండలం బొర్రం పాలెంనకు చెందిన సంసోన్‌తో వివాహం అయింది. ఒక కుమార్తె ఉంది. ఏడాది క్రితం గొడ వలు రావడంతో ఆమె తన కుమార్తెతో పుట్టింటికి కొత్తపల్లి వచ్చేసి అక్కడే ఉంటున్నది. ఏమైందో ఏమో కాని గురువారం మధ్యాహ్నం పురుగుమందు తాగింది. కుటుంబ సభ్యులు ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకురాగా ఆమె అప్పటికే మరణించిందని నిర్ధారించి ఆసుపత్రి మార్చురీకి తరలించారు. అనుమానాస్పద మృతిగా భావించి ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు.


### చికిత్స పొందుతూ ఒకరి మృతి

ఏలూరు క్రైం, ఆగస్టు 1 : మొదటి భార్య పిల్లలను రెండవ భార్య చూడడం లేదని తీవ్ర మనస్థాపానికి గురైన ఒక వ్యక్తి పురుగుమందు తాగి తీవ్ర అస్వస్థతతకు గురై మృతి చెందాడు. భీమవరంలోని గునుపూడికి చెందిన ఐకె శ్రీనివాసరావు (45)కు మొదటి భార్య మరణించగా, ఆమెకు ఇద్దరు కుమారులు ఉన్నారు. రెండో పెళ్లి చేసుకోగా ఆమెకు ఒక కుమార్తె పుట్టింది. మొదటి భార్యకు పుట్టిన ఇద్దరు మగ పిల్లలను సరిగా చూడడం లేదనే విషయమై వారి మధ్య గొడవలు జరుగుతున్నాయి. బుధవారం పురుగు మందు తాగాడు. అతని పరిస్థితి ప్రమాదకరంగా ఉండడంతో ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. గురువారం మృతి చెందాడు. ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

### ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన బైక్..యువకుడి మృతి

ఏలూరు క్రైం, ఆగస్టు 1 : పదో నంబర్ జాతీయ రహదారిపై లారీ టైర్ పంక్చర్ కావడంతో గురువారం రాత్రి లారీ నిలిపివేశారు. అతివేగంగా వస్తున్న మోటారు సైకిలిస్టు అది గమనించకుండా ఢీ కొనడంతో అక్కడి కక్కడే మృతిచెందాడు. ఏలూరు వైపు నుంచి తాడేపల్లిగూడెం జాతీయ రహదారిపై మార్గమధ్యలో పూళ్ళ వద్ద ఒక లారీ టైర్ పంక్చర్ అవడంతో నిలిపి వేశారు. ఏలూరు వైపు నుంచి అతి వేగంగా వస్తున్న మోటారు సైకిలిస్టు ఆ లారీని వెనుక నుంచి ఢీ కొన్నాడు. దీంతో అతనికి హెల్మెట్ లేక పోవడం వల్ల అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని వివరాలు తెలియాల్సి ఉంది. మోటారు సైకిల్ నెంబర్ ఎపీ 37 డీఎన్ 0807గా ఉంది. భీమడోలు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఏలూరు ప్రభు త్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### మోటారు సైకిళ్ల దొంగలు అరెస్టు



ఏలూరు క్రైం, ఆగస్టు 1 : మోటారు సైకిళ్లను అపహరిస్తున్న ముగ్గురు యువకులను ఏలూరు రూరల్ పోలీ సులు గురువారం సాయంత్రం అరెస్టు చేశారు. ఏలూరు కుమ్మరిరేవు రెండవ వీధికి చెందిన కర్రి సత్యనారాయణ (22), ఏలూరు డిమార్టు ఎదురుగా మోతేవారి తోటకు చెందిన చిలకల నికిల్‌సాయ్ (19), ఏలూరు తాపీమేస్త్రీ కాలనీ 9వ రోడ్డునకు చెందిన ఉప్పాడ కార్తీక సాయి (21) నగరంలో రాత్రి వేళ తిరుగుతూ మోటారు సైకి ళ్లను అపహరిస్తున్నారు.జిల్లా ఎస్పీ కిషోర్ ఆదేశాల మేరకు ఏలూరు వన్‌టౌన్ సీఐ రాజశేఖర్, ఎస్ఐ లక్ష్మణబాబు, హెడ్‌కానిస్టేబుల్ అప్పన్న, కానిస్టేబుళ్ళు శ్రీనివాసరావు, మోహన్ కృష్ణలు బృందంగా ఏర్పడి నిఘా పెట్టారు. గురువారం సాయంత్రం ఏలూరు వన్ టౌన్‌లోని గాంధీ మైదానం గవర్నమెంట్ వైన్‌షాపు వద్ద స్కూటీపై ఈ ముగ్గురు అనుమానాస్పదంగా ఉండడంతో అదుపులోకి తీసుకుని విచారణ చేశారు. దీంతో వారి నుంచి ఆరు మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు.

## పేదలకు అన్నదానం.. పూర్వ జన్మ సుకృతం


దాత సత్యనారాయణరాజును సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

ఆకివీడు, ఆగస్టు 1 : పేద ప్రజలకు అన్నదానం చేయడం పూర్వజన్మ సుకృతమని టీడీపీ మండల-పట్టణ అధ్యక్షులు మోటుపల్లి రామవర ప్రసాద్, బొల్లా వెంకట్రావు అన్నారు. స్థానిక దొరగారి చెరువు వద్ద దాత గొట్టుముక్కల వెంకట సత్యనారాయణరాజు ఆర్థిక సహకారంతో కొనసాగుతున్న అన్నక్యాంటీన్ యాభై రోజులు పూర్తయిన సందర్భంగా గురువారం టీడీపీ ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించారు. ప్రతీరోజు పేదలకు వడ్డనలు చేస్తున్న టీ డీపీ నేతలనూ సన్మానించారు. మాజీ సర్పంచ్ గొంట్లా గణపతి తదితరులు ఉన్నారు.

## వీధి విక్రయదారులకు సహకరించాలి

తణుకు, ఆగస్టు1 :వీధి విక్రయదారుల సంక్షేమానికి, ఉపాధి భద్రతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకరించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కోనాల భీమారావు అన్నారు. తణుకులోని సీపీఐ కార్యాలయంలో గురువారం సంచార నాలుగు చక్రాల బండ్ల మిక్చర్, పానీపూరీ, వర్తక సంఘ సమావేశంలో మాట్లాడుతూ ఉన్నత చదువులు చదివిన వారు సైతం ప్రభుత్వంపై ఆధారపడకుండా బండ్లపై తినుబండారాలు అమ్ముకుంటూ జీవిస్తున్నారన్నారు. వీరికి సబ్సిడీ రుణాలు అందించి ఆదుకోవాలన్నారు. సంఘ అధ్యక్షుడు కిలాని శ్రీనివాసు, రేలంగి రాజు, రవిపతి తదితరులు పాల్గొన్నారు.

## 700 మందికి వైద్య సేవలు

పెంటపాడు, ఆగస్టు 1 : స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ తాడేపల్లి సూర్యకళ ఆధ్వర్యంలో గురువారం మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశా రు. ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ తనయుడు రాజేష్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కిలపర్తి వెంకట్రావు, ఎంపీపీ దాసరి హైమావతి శిబిరాన్ని ప్రారంభించారు. ఎముకల వైద్యులు డాక్టర్ వంశి సుమారు 700 మందికి వైద్యసేవలు అందించి ఉచితంగా మందులు పంపి ణీ చేశారు. తాడేపల్లి ఈశ్వరరావు, దాసరి అప్పన్న, ఉపసర్పంచ్ కొవ్వూరి ప్రసాద్‌రెడ్డి, నల్లమిల్లి చినగోపిరెడ్డి, దాసరి సతీష్‌కుమార్, కొవ్వూరి లక్ష్మణరెడ్డి, దాసరి కృష్ణవేణి, ఎంపీటీసీ రెడ్డిసూరిబాబు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

తణుకు/పెంటపాడు, ఆగస్టు 1 :తణుకు పట్టణంలోని 11కేవీ ఫీడర్ల వార్షిక మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకు కరెంట్ సరఫరా ఉండదని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సీహెచ్ రామకృష్ణ తెలిపారు. పట్టణంలో బొమ్మల వీధి, సూర్యాలయం వీధి, రామకృష్ణ సేవాసమితి, ఆపిల్ ఆస్పత్రి, సజ్జాపురం, పెరవలి రోడ్డు, బైపాసు రోడ్డు, అజ్జరం కాలనీ, ఇందిరమ్మ కాలనీ ప్రాంతాల కరెంట్ ఉండదన్నారు. పెంటపాడు మండలంలోని కె.పెంటపాడు, పరిమెళ్ళ, యానాలపల్లి, పడమరవిప్పర్రు గ్రామాల్లో ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ ఉండదని డీఈ వెంకటేశ్వరరావు తెలిపారు.

## కోడిగుడ్లు, నిమ్మరసంతో మేలైన సేద్యం

పాలకోడేరు, ఆగస్టు1 : ప్రకృతి వ్యవసాయంలో కోడి గుడ్లు, నిమ్మరసంతో మేలైన సేద్యం చేసుకోవచ్చని జిల్లా ప్రకృతి వ్యవసాయ కో-ఆర్డినేటర్ అరుణ కుమారి అన్నారు. గొల్లలకోడేరులో ప్రకృతి వ్యవసాయంలో అవలంభించే పద్ధతుల్లో భాగంగా కోడిగుడ్లు నిమ్మరసంతో తయారు చేసే పద్ధతిపై గురువారం గ్రామంలోని మహిళలకు, రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంనిమ్మరసం, కోడిగుడ్లతో కలిపిన ద్రావణాన్ని పంటపొలాలపై పిచికారీ చేయడం ద్వారా అధిక లాభాలు పొందవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మండల ఇన్‌చార్జి రవికుమార్, ఎం.వీరేంద్ర, ఎం.వెంకటలక్ష్మి, రమాదేవి, జానకి, మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## మ్యాజిక్ స్టార్ బోస్‌కు సన్మానం


బోస్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు

భీమవరం టౌన్, ఆగస్టు 1 : ప్రముఖ ఇంద్ర జాలికుడు మ్యాజిక్ స్టార్ ఇందుకూరి సత్యనారాయణరా జు (బోస్)కు యూరోపియన్ రికార్డు సంస్థ (హంగేరి దేశం) నుంచి మల్టీ టాలెంటెడ్ మెజీషియన్ అవార్డు పొందిన సందర్భంగా శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఉండి ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణరాజు సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రఘురామ మాట్లాడుతూ బోస్ దశాబ్దాలుగా తన ఇంద్రజాల కళతో సామాజిక చైతన్యం చేస్తున్నారన్నారు. హంగేరి దేశం మల్టీ టాలెంటెడ్ అవార్డు అందివ్వడం విశేషమని అభినందించారు. కన్వీనర్ చెరుకువాడ రంగసాయి, కొత్తపల్లి నాగరాజు, నరహరిశెట్టి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## రంగసాయికి ఉత్తమ సేవా అవార్డు


అవార్డు ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న రంగసాయి

భీమవరంటౌన్, ఆగస్టు 1 : సార్వత్రిక ఎన్నికల స్వీప్ యాక్టివిటీస్ జిల్లా బ్రాండ్ అంబాసిడర్‌గా విశేష సేవలు అందించిన చెరుకువాడ రంగసాయికి జిల్లా ఎన్నికల ప్రభుత్వ నోడల్ అధికారి కేసీహెచ్ అప్పారావు ఉత్తమ సేవ అవార్డు అందించారు. అనంతరం కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆదేశాల మేరకు ఉత్తమ సేవా అవార్డుతో సత్కరించారని రంగసాయి తెలిపా రు. నరహరి శెట్టి కృష్ణ పాల్గొన్నారు.

## 'పేదలకు అన్నదానం అభినందనీయం'

భీమవరంటౌన్, ఆగస్టు 1 : సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుండే నాయుడు ఆదిలక్ష్మి తొమ్మిదో వర్ధంతి సందర్భంగా వారి కుమారులు నాగేంద్ర, అయ్యప్ప సేవకార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి చనమల చంద్రశేఖర్ అన్నారు. భీమవరం గొల్లవానితిప్పరోడ్డులోని ప్రకాష్ నగర్ కాలనీలో పేదలకు అన్నదానం వస్త్ర దానం, వంద మందికి భోజనం ప్యాకెట్లు, చీరలు పంపిణీ చేశారు.

## సంక్షిప్త సమాచారం..

- **ఉండి, ఆగస్టు 1 :** కార్డుదారులకు ఇబ్బంది లేకుండా ఇంటింటికి రేషన్ సరుకులను పంపిణీ చేయాలని సీఎస్‌డీటీ మహేష్ ఎండీయూ వాహనదారులకు సూచించారు.
- ఆకివీడు : పట్టణం పచ్చదనంతో విరాజిల్లాలంటే స్థానికుల సహకారంతోనే సాధ్యమని మెయిన్ సెంటర్‌లో చెత్త తరలిస్తున్న పనులు పరిశీలించిన అనంతరం నగర పంచాయతీ కమిషనర్ జి.కృష్ణమోహన్ అన్నారు.
- పాలకొల్లు అర్బన్ : ఏఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హెల్త్ కేర్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి నేతృత్వంలో ప్రపంచ ఊపిరితిత్తుల క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.
- భీమవరం అర్బన్ : మున్సిపల్ అసిస్టెంట్ శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా కొల్లిబత్తుల మహంకాళి విశేష సేవలు అందించారని ఉద్యోగ విరమణ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా నేత చెల్లబోయిన రంగారావు అన్నారు.
- తణుకు : ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని సీఐ నాగరాజు, ట్రాఫిక్ ఎస్ఐ జానా సతీష్ అన్నారు. ఆపిల్ ఆస్పత్రి ఎండీ డాక్టర్ సుందరావు, సిబ్బంది, పట్టణ పోలీసులు సంయుక్తంగా గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు.
- నరసాపురం టౌన్ : మునిసిపాల్టీలో శానిటేషన్ విభాగంలో పనిచేస్తున్న శానిటరీ సిబ్బందికి ఎమ్మెల్యే నాయకర్ రెయిన్ కోటులను పంపిణీ చేశారు. చైర్‌పర్సన్ వెంకటరమణ, కమిషనర్ వెంకటేశ్వరావు, నెక్కంటి సుబ్బారావు, ఆర్ఐ నానాజీ ఉన్నారు.
- పాలకొల్లు అర్బన్ : క్షీరా రామలింగేశ్వర స్వామివారి శివుని పార్థివ శివ లింగాలను రెండు నెలల నుంచి తయారు చేస్తున్న మహిళలకు యునైటెడ్ కాపు ఇంటర్నేషనల్ సర్వీస్ క్లబ్ సభ్యులు పండ్లు పంపిణీ చేశారు.





భీమవరం, జక్కరం, పెనుగొండ, నరసాపురంలలో పింఛన్ సొమ్ములు అందిస్తున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కొళ్ళ నాగేశ్వరరావు.. ఎమ్మెల్యేలు రఘురామకృష్ణంరాజు, పితాని సత్యనారాయణ, బొమ్మిడి నాయకర్, టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి

# కూటమితోనే సంక్షేమ పాలన

- టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి
- పింఛన్ల పంపిణీ కార్యక్రమాలు

భీమవరం అర్బన్, ఆగస్టు 1: కూటమి ప్రభుత్వంతోనే పేదలకు సంక్షేమం సాధ్యమని, వేగవంతమైన పరిపాలన అందిస్తున్నారని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ ముందుకు సాగుతున్నారని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి అన్నారు. పట్టణంలోని దుర్గాపురం మెంటే వారి తోటలోని 39, 2వ వార్డులలో ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల కార్యక్రమాలో ఆమె పాల్గొన్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్ ఇందుకూరి రామలింగరాజు, పట్టణ అధ్యక్షులు ఇందుకూరి సుబ్రహ్మణ్యంరాజు తదితరులు పాల్గొన్నారు. మరోవైపు పట్టణంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు అధికారులతో కలసి పింఛన్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బందితో ఇంటింటికి వెళ్లి పింఛన్లు అందించారు.

- పాలకోడేరు/ఆకివీడు/ఆకివీడురూరల్/కాళ్ల/ఉండి : పాలకోడేరు మండలం విస్సాకోడేరులో ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణరాజు గురువారం పింఛన్లు పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ బొల్లా శ్రీను, పాలకోడేరు సొసైటీ బ్యాంక్ మాజీ అధ్యక్షుడు కొత్తపల్లి నాగరాజు, ఆరేపల్లి నాగరాజు, బొర్రా కోటేశ్వరరావు, జుత్తిగ నాగరాజు, నడిపూడి అప్పారావు తదితరులు ఉన్నారు. ఆకివీడు పట్టణ పరిధిలో 95 శాతం పింఛన్ల పంపిణీ జరిగిందని నగరపంచాయతీ కమిషనర్ జి.కృష్ణమోహన్ తెలిపారు. ఆకివీడు ఇరవై వార్డులో మొత్తం 3,275 పింఛన్లకు గాను 3,112 మందికి పంపిణీ చేశామన్నారు. ఆకివీడు రూరల్ గ్రామాల్లో టీడీపీ, జనసేన నాయకుల ఆధ్వర్యంలో మండలంలో 5,441 పింఛన్లకు గాను రూ.2,75,95,500 మంజూరైందని ఎంపీడీవో రామకృష్ణ తెలిపారు. ఆయా గ్రామాల్లో పింఛన్లు అందించారు. కాళ్ళ మండలంలోని పలు గ్రామాల్లో పింఛన్లు పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే రఘురామ హాజరయ్యారు. 96 శాతం పింఛన్లు పంపిణీ చేశామని ఎంపీడీవో స్వాతి తెలిపారు. ఉండి మండలం చిలుకూరులో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే రఘురామ ప్రారంభించి మాట్లాడారు. వలంటీర్లు వైసీపీకి వారధి వంటి వారే కానీ.. వారు లేకపోవడం వల్ల ఎవరికి నష్టం లేదన్నారు. వైసీపీ ప్రభుత్వం తమకు అనుకూలంగా వుండేందుకు వలంటీర్లను నియమించుకున్నారని విమర్శించారు.
- పెనుగొండ/ఆచంట/పోడూరు :పెనుగొండ మండలం కొఠాలపర్రు, మునమర్రు గ్రామాలు, ఆచంట మండలం శేషమ్మ చెరువు గ్రామం, పోడూరు మండలం పండితవిల్లూరు, తూర్పుపాలెం గ్రామాల్లో ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అధికారులతో కలిసి పింఛన్లు అందజేశారు. పెనుగొండ మండలంలో 94.04 శాతం పింఛన్లు పంపిణీ చేశామని ఎంపీడీవో శ్రీనివాస దొర తెలిపారు. ఆచంట మండలంలో 95.23 శాతం పంపిణీ చేశామని ఎంపీడీవో నరసింహప్రసాద్ తెలిపారు.
- నరసాపురం టౌన్/మొగల్తూరు : నరసాపురం పట్టణ, మండలంలోని పలు గ్రామాలు, వార్డుల్లో సచివాలయ సిబ్బందితో కలిసి ఎమ్మెల్యే నాయకర్, టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు పింఛన్లు అందించారు. చైర్‌పర్సన్ వెంకటరమణ, కమిషనర్ వెంకటేశ్వరావు, కౌన్సిలర్లు పాల్గొన్నారు. మొగల్తూరు మండలంలో 92.77 శాతం అందించినట్టు ఎంపీడీవో వి.బాబ్జిరాజు తెలిపారు.
- గణపవరం : గణపవరం మండలంలోని 25 గ్రామాల్లో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని కూటమి నాయకులు, అధికారులు చేపట్టారు. మండలంలోని 8,821 మందికి పింఛన్‌దారులకు రూ.3 కోట్ల 76 లక్షల 18,500 పంపిణీ చేశారు. పిప్పరలో గణపవరం మండల టీడీపీ అధ్యక్షుడు ఇందుకూరి రామకృష్ణంరాజు, అప్పనన్నపేట, మల్లపురాజుపేటలో టీడీపీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి యాళ్ళ సుబ్బారావు, అర్ధవరంలో ఉంగుటూరు నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షుడు అద్దేపల్లి వాసురాజు, గణపవరంలో పట్టణ టీడీపీ అధ్యక్షుడు కూసంపూడి సురేంద్ర కుమార్‌రాజు ఆధ్వర్యంలో పింఛన్ల పంపిణీ నిర్వహించారు.
- తణుకు : ఇచ్చిన మాటకు కట్టుబడి పింఛన్లు అందజేస్తున్న ఘనత సీఎం చంద్రబాబుకు దక్కుతుందని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజు అన్నారు. అత్తిలి మండలం వరిఘేడు లో పింఛన్లు పంపిణీ చేశారు. 96 శాతం మందికి పింఛన్లు అందజేశామ న్నారు.
- తాడేపల్లిగూడెం రూరల్/పెంటపాడు : వలంటీర్లు లేకున్నా ఉద్యోగులతో పింఛన్లు పంపిణీ చేసి చూపించిన పాలనాదక్షుడు చంద్రబాబు అని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి అన్నారు. తాడేపల్లిగూడెం మండలంలోని కడియద్ద, పెంటపాడు మండలంలోని పలు గ్రామాల్లో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లా నాయకులు వాడపల్లి వెంకట సుబ్బరాజు, గ్రామ కూటమి నాయకులు మద్దిపాటి సత్యనారాయణ, పమిడి భానుచందర్ తదితరులు పాల్గొన్నారు. పెంటపాడులో కిలపర్తి వెంకట్రావు, దాసరి అప్పన్న, గంధం సతీష్, నల్లమిల్లి చినగోపిరెడ్డి, దాసరి సతీష్‌కుమార్, దాసరి కృష్ణవేణి, మద్దుకూరి రామకృష్ణ, కొండ్రెడ్డి హైమావతి తదితరులు పాల్గొన్నారు.
- పాలకొల్లు రూరల్ : దిగమర్రు గ్రామానికి చెందిన స్థానవరపు సీతమ్మ అనే వృద్ధురాలికి ఇటీవల పిచ్చికుక్క కాటుకు గురైన ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్సపొందుతున్న ఆమెకు సచివాలయ సిబ్బంది పింఛన్ సొమ్ము అందించారు. వృద్ధాప్యపు రూ.4 వేలను సర్పంచ్ రాపాక నగేష్ కరుణాకర్, సచివాలయ సిబ్బంది అందించారు.



వరిఘేడులో పింఛన్లు అందిస్తున్న ఎమ్మెల్యే ఆరిమిల్లి, మంతెన.. తాడేపల్లిగూడెంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న వలవల బాబ్జి, తదితరులు

## వలంటీర్లతో జగన్ అరాచక పాలన : పితాని

పెనుమంట్ర, ఆగస్టు 1 : వలంటీర్లను అడ్డుపెట్టుకుని రాష్ట్రంలో జగన్ అరాచక పాలన సాగించారని మాజీ మంత్రి ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం పెనుమంట్ర మండలం నెలమూరు, ఆలమూరు గ్రామాల్లో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వలంటీర్లు లేకపోతే ఇంటింటికి పింఛన్లు అందించలేనని హైకోర్టుకు సీఎస్ జవహర్‌రెడ్డి చెప్పారని, నేడు వలంటీర్లు లేకపోయినా సచివాలయ సిబ్బంది ఒక్క రోజులోనే పూర్తిస్థాయిలో పింఛన్లు పంపిణీ చేసిన ఘనత ఎన్డీఏ ప్రభుత్వానికి దక్కుతుందని అన్నారు ఐదేళ్ల వైసీపీ పాలనలో ఆలమూరులో అరాచక పాలన సాగిందని తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులకు ఇళ్ల స్థలాల ఎంపిక, పింఛన్ల పంపిణీ, రేషన్ కార్డులు పలు సంక్షేమ పథకాలు అందకుండా స్థానిక నేతలు అడ్డుకున్నారని విమర్శించారు. ఇళ్ల స్థలాలు రూ.50 వేలకు అమ్ముకున్నారని ఆరోపించారు. సర్పంచ్ మేనపురెడ్డి వెంకటరమణ, ఎంపీడీవో పి.పద్మజ, టీడీపీ మండలాధ్యక్షుడు తమనంపూడి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## లెప్రసీ కాలనీలో మౌలిక వసతులు కల్పించాలి

- కలెక్టర్ నాగరాణి

భీమవరంటౌన్, ఆగస్టు 1 :లెప్రసీ కాలనీవాసులకు మౌలిక వసతులు మెరుగుపరచాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. గురువారం మారుతీ నగర్ ఏడో వార్డు లెప్రసీ కాలనీలో పింఛన్లు పంపిణీ కార్యక్రమం అనంతరం లెప్రసీ కాలనీలోని పలు గృహాలకు ఆమె స్వయంగా వెళ్లి వారి యోగక్షేమాలను తెలుసుకుని, కాలనీలో వారికి ఉన్న ఇబ్బందులపై ఆరా తీశారు. పిల్లల్ని బడికి పంపుతున్నారా, పిల్లలు చదువుకుంటున్నారా అని అడిగి తెలుసుకున్నారు. కొంతమందికి ఇళ్లు లేవని, మరుగు దొడ్లు ఇబ్బందిగా ఉన్నాయని ఆమెకు తెలపగా వెంటనే మునిసిపల్ కమిషనర్ శ్యామలను ఆదేశిస్తూ అవసరమైన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని ఆదేశించారు.

## తల్లిపాలతోనే తల్లీబిడ్డకు రక్షణ

- కలెక్టర్ చదలవాడ నాగరాణి


భీమవరం ప్రభుత్వాసుపత్రిలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం క్రైం, ఆగస్టు 1 : పుట్టిన బిడ్డకు తల్లిపాలు పడితే బిడ్డతో పాటు తల్లి కూడా ఆరోగ్యంగా ఉంటుందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. గురువారం భీమవరం ఏరియా ఆసుపత్రిలో అంతర్జాతీయ తల్లిపాల వారోత్సవాలలో భాగంగా ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా ఆమె పాల్గొని మాట్లాడారు. పుట్టిన బిడ్డకు తల్లిపాలు కనీసం ఆరు మాసాలు వరకు బిడ్డకు అందించాలన్నారు. ఆగస్టు ఒకటి నుంచి ఏడో తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలు సందర్భంగా జిల్లాలోని ప్రతీ గ్రామంలో వైద్య ఆరోగ్యశాఖ, స్త్రీ శిశు సంక్షేమశాఖ సమన్వయంతో అవగాహన కల్పించాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డి.మహేశ్వరరావు మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డలకు టీకాలు మాదిరిగా పనిచేస్తాయన్నారు. జిల్లా స్త్రీ, శిశు సంక్షేమశాఖ అధికారి పి.సుజాతరాణి మాట్లాడుతూ తల్లి బిడ్డకు ఏ సమయంలో పాలు ఇవ్వాలి, ఏ భంగిమలో ఇస్తే మంచిది అని క్షేత్రస్థాయిలోకి వెళ్లి సిబ్బంది ద్వారా తెలుపుతామన్నారు. గర్భిణులు, బాలింతలకు పలు రకాల పండ్లను కలెక్టర్ చేతుల మీదుగా అందించారు. తల్లిపాలు అమృతం, డబ్బా పాలు వద్దు అని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం సంబంధిత పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ వి.మాధవి కళ్యాణి, శ్రీవిజ్ఞాన వేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి, వైద్యులు ప్రవీణ్, సిబ్బంది పాల్గొన్నారు.

- కాళ్ళ/ఆకివీడు రూరల్/పాలకోడేరు, ఆగస్టు 1 : పుట్టిన బిడ్డకు ఆరు నెలలు వరకు తల్లిపాలు తప్పనిసరిగా పట్టాలని జిల్లా వైద్య కార్యాలయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ డాక్టర్ సీహెచ్ ధనలక్ష్మి తెలిపారు. తల్లి పాల వారోత్సవాలలో భాగంగా కాళ్ళ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ సరాబు సునీల్ అధ్యక్షతన గురువారం ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ఆమెతో పాటు మండల పరిషత్ ఏవో ప్రభాకరరావు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. డాక్టర్ డి.సునీత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. ఆకివీడు మండలం చినకాపవరం గ్రామంలో తల్లిపాల వారోత్సవాలు కార్యక్రమంలో భాగంగా గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. పెదకాపవరం పీహెచ్‌సీ వైద్యులు ఎం.రమేష్, సీహెచ్‌వో కె.ప్రసాద్, రాజామణి, నాగవాణి, ఏఎఎన్ఎంలు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు. పాలకోడేరు మండలం పాలకోడేరు గ్రామంలో పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ సీహెచ్‌వీ.రంగం నాయుడు ఆధ్వర్యంలో అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల ఆవశ్యకతపై వైద్యసిబ్బంది అవగాహన కల్పించారు. వైద్యురాలు డాక్టర్ స్వర్ణ నిరంజని, సీహెచ్‌వో సత్యనారాయణ, పీహెచ్ఎన్ కుమారి, సూపర్‌వైజర్లు శంకర్, అమ్మాజీ, వైద్య సిబ్బంది, అంగన్వాడీ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.
- గణపవరం : గణపవరం, పిప్పర పీహెచ్‌సీలో తల్లిపాల వారోత్సవాలు ప్రారంభించారు. ప్రభుత్వ వైద్యాధికారులు డాక్టర్ పీహెచ్ఆర్ సంతోష్, డాక్టర్ ప్రియాంక ఆధ్వర్యంలో తల్లిపాల ప్రాధాన్యం గురించి వివరించి పోస్టర్ ఆవిష్కరించారు. తల్లిపాలు ఇవ్వడం వలన వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందని పిల్లలను వ్యాధులు రాకుండా కాపాడుకోవచ్చని తెలిపారు. ఎంపీహెచ్‌వోలు విల్సన్‌బాబు, వెంకటేశ్వర్లు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.
- పాలకొల్లు అర్బన్/పాలకొల్లు రూరల్ : పాలకొల్లు ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో సీడీపీవో సీహెచ్ ఇందిర పర్యవేక్షణలో ఏడో తేదీ వరకు తల్లి పాల వల్ల కలిగే ప్రయోజ నాలను పట్టణ, గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నామన్నారు. సూపర్‌వైజర్లు సత్యవేణి, తదితరులు పాల్గొన్నారు. పాలకొల్లు రూరల్ పెదగరువులో సూపర్‌వైజర్ ఎస్ఎన్ మల్లేశ్వరి నేతృత్వంలో తల్లిపాల వారోత్స వాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీలు జి.ప్రశాంతి, డి. లక్ష్మీదుర్గ, పి. అభిరాణి, పాముల రజనీకుమార్, దొడ్డా ఏడుకొండలు గ్రామస్థులు పాల్గొన్నారు.
- తాడేపల్లిగూడెం రూరల్ : తల్లిపాలే చంటి బిడ్డకు సంజీవని లాంటిదని జనసేన యువ నాయకులు బొలిశెట్టి రాజేష్ అన్నారు. తాడేపల్లిగూడెంలోని ఏరియా ఆస్పత్రి వద్ద తల్లిపాల వారోత్సవాల సందర్భంగా లయన్స్ క్లబ్, కాళ్ల గోపీకృష్ణ సహకారంతో వంద మంది చంటిపిల్లల తల్లులకు పౌష్టికాహారం, పండ్లు పంపిణీ చేశారు. సీడీపీవో టీఎల్ సరస్వతి, ఆస్పత్రి సూపరింటెండెంట్ సూర్యనారాయణ, సూపర్‌వైజర్‌లు తదితరులు పాల్గొన్నారు.
- మొగల్తూరు ఐసీడీఎస్ కార్యాలయం వద్ద అవగాహన ర్యాలీని నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు, టీడీపీ, జనసేన మండల పార్టీల అధ్యక్షులు గుబ్బల నాగరాజు, కొల్లాటి గోపి, కైలా సుబ్బారావు, సర్పంచ్ పడవల మేరి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ, ఎస్టీలకు ద్రోహం చేసిన వైసీపీ ప్రభుత్వం

కాళ్ళ, ఆగస్టు 1 : ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు వైసీపీ ప్రభుత్వం తీరని అన్యాయం చేసిందని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సమైఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు సోడదాసి గంగయ్య అన్నారు. కాళ్ళ మండలం సీసలిలో గురువారం జరిగిన సమాఖ్య సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్పొరేషన్‌ల ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రావాల్సిన నిధులు ఇవ్వలేదని, సబ్ ప్లాన్ నిధులను దారి మళ్ళించిందని విమర్శించారు. అందుకే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు జగన్ ప్రభుత్వాన్ని గద్దె దించారని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రావాల్సిన పథకాలు పునరుద్ధరిస్తామని అసెంబ్లీ వేదికగా ప్రభుత్వం చెప్పడం హర్షణీయమన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎంపికచేసి నియామక పత్రాలను అందించారు. కార్యక్రమంలో అనిల్‌కుమార్, కృపానందం, వెంకటరత్నం, రాజ్‌కుమార్, రత్నంరాజు, శ్యాంసుందర్, ఆశోక్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## పంట నష్టం అంచనా తయారీకి త్రిసభ్య కమిటీ

నరసాపురం రూరల్, ఆగస్టు 1: ఇటీవల కురిసిన వర్షాలు, వరదల కారణంగా జరిగిన పంట పొలాల నష్టం అంచనా వేసేందుకు త్రిసభ్య కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసినట్టు వ్యవసాయశాఖ ఏడీఈ డాక్టర్ అనిల్‌కుమారి తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామస్థాయిలో వీఆర్వో, వీఏ, వీహెచ్, మండల స్థాయిలో తహసీల్దార్, ఎంఈవో, ఎంపీడీవో, డివిజన్ స్థాయిలో ఆర్డీవో, వ్యవసాయశాఖ ఏడీఈ సభ్యులుగా ఉంటారన్నారు. ప్రతి గ్రామంలో జరిగిన నష్టంపై అంచనా వేసి జిల్లా అధికారులకు కమిటీ సభ్యులు నివేదించాలన్నారు. ఎంతమంది రైతులు నష్టపోయారు, పంట ఎంతనష్టం జరిగింది తదితర వివరాలను సేకరిస్తామన్నారు. ఈవిధంగా తయారు చేసిన జాబితాను పదో తేదీ లోపు జిల్లా అధికారులకు నివేదిస్తామన్నారు. ఈనెల 4 నుంచి 9 వరకు గ్రామాల్లో సర్వే చేస్తున్నందున్న రైతులు రెవెన్యూ సిబ్బందికి అందుబాటులో ఉండి తమ వివరాలను తెలియజేయాలన్నారు

## ఆధ్యాత్మికం

## మావుళ్ళమ్మకు ఆషాఢ సారె


మావుళ్ళమ్మకు సారెను అందిస్తున్న మోటారు మెకానిక్స్

భీమవరంటౌన్, ఆగస్టు 1 : భీమవరం మోటార్ సైకిల్ మెకానిక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణ ఇలవేల్పు మావుళ్ళమ్మకు ఆషాఢ మాస సారె సమర్పించారు. పలు రకాల పండ్లు, స్వీట్లు, చీర, గాజులు, పసుపు, కుంకుమ, పూలువంటి ద్రవ్యాలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి సారె సమర్పించారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు ఈమని చంద్రమౌళి, అధ్యక్షుడు బందెల హనుమంతరావు, ప్రధాన కార్యదర్శి ముమ్మన విజయకుమార్, కోశాధికారి బురిడి సత్య వరప్రసాద్, ఉపాధ్యక్షుడు తోట కిరణ్ కుమార్, గాదం వీరభద్రరావు, ఉప కార్యదర్శిలు గెద్ద రామా రావు,అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి పట్నాల చిట్టిబాబు, జిల్లా గౌరవ సలహాదారు సిరి యాల నాగేశ్వరరావు, సభ్యులు పాల్గొన్నారు.

### సీతాదేవి అమ్మవారికి సారె

పెంటపాడు, ఆగస్టు 1 : కె.పెంటపాడు వెలంపేట కోదండరామాలయంలో గురువారం సీతాదేవి అమ్మవారికి గ్రామస్తులు చీర, సారె సమర్పించారు. మేళ తాళా లతో ఊరేగింపుగా వెళ్ళి అమ్మవారికి సారెను అందజేశారు. ఆలయ కమిటీ చైర్మన్ ఆదిరెడ్డి సన్నిబాబు, ఉపాధ్యక్షుడు అల్లాడి దుర్గారావు పాల్గొన్నారు.

### సాయిబాబాకు విశేష పూజలు

కాళ్ళ, ఆగస్టు 1 : సీసలిలో వున్న షిర్డీ సాయిబాబా ఆలయంలో గురువారం స్వామికి అభిషేకాలు, అర్చనలు, విశేష పూజలు నిర్వహించారు. ఆషాఢమాసం ఆఖరి గురువారం కావడంతో ప్రత్యేక అలంకరణ చేసి బాబాకు పలు రకాల వంటలతో నైవేద్యం సమర్పించారు. భక్తులకు కావాల్సిన ఏర్పాట్లను ట్రస్టు బోర్డు చైర్‌పర్సన్ తోరం అనంతలక్ష్మి సత్యవతిదేవి పర్యవేక్షించారు.

- పెనుగొండ : పెనుగొండ మండలం వడలి గ్రామంలో వున్న సాయి బాబా వారి ఆలయం నుంచి గ్రామదేవత మందాలమ్మ అమ్మవారి చలిమోర్ ఊరేగింపుగా తీసుకెళ్ళారు. ఈ సందర్భంగా పానకాల కావిడి, పసుపు కుంకుమ, గాజులు, పండ్లు, ఫలాలతో భక్తులు చలిమోర్ చెల్లించారు. వడలి గ్రామంలో ఆషాఢ మాసం పురస్కరించుకుని గురువారం సాయిబాబాకు వెలిచేటి చంద్రశేఖర్‌ప్రసాద్ వితరణ చేసిన కాయగూరలతో అలంకరించారు. సాయి అగస్త్రేశ్వర సేవా సమితి సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.
- పెనుమంట్ర: ఆషాఢమాసం సందర్భంగా పెనుమంట్రలోని లక్ష్మీగణపతిని శాకంబరీ అలంకరణ చేశారు. రెవెన్యూ అధికారుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు, రాధాదేవితోపాటు భక్తులు పూజలో పాల్గొన్నారు. నల్లిమిల్లి గోపిరెడ్డి, తుంపూడి విజయ్ కుమార్, తాడి వీరవెంకట రెడ్డి, జంపన శ్రీనివాసరాజు, అరటికెట్ల సత్యనారాయణ, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## 'ప్రత్యేక హోదా కోసం పోరాటం చేయాల్సిందే'


మాట్లాడుతున్న సీతారాం

తణుకు, ఆగస్టు1 : ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి జరగాలంటే ప్రత్యేక హోదా కోసం పోరాటం చేయాల్సిందేనని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం అన్నారు. సీపీఎం జిల్లా విస్తృత స్థాయి సమావేశం తణుకులోని లయన్స్ క్లబ్ ఆడిటోరియంలో గురువారం నిర్వహించారు. సమావేశానికి అధ్యక్షవర్గంగా జేఎన్‌వీ గోపాలన్, పీవీ ప్రతాప్, కేతా గోపాలన్, చింతకాయల బాబురావు, డి.కళ్యాణి వ్యవహరించారు. సీతారాం మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ పేద ప్రజలపై భారం వేసే విధంగా ఉందని విమర్శించారు. పార్టీ జిల్లా కార్యదర్శి బి.బలరామ్ మాట్లాడుతూ వర్షాలు వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవాలన్నారు. కార్యదర్శి వర్గ సభ్యులు కె.పెద్దిరాజు, వాసుదేవరావు, రాజా రామ్మోహనరాయ్, నర్సింహారావు, జి.శ్రీనివాసు, అజయకుమారి పాల్గొన్నారు.

## పైపులైన్‌ను పరిశీలించిన ఆర్‌డబ్ల్యూస్ ఎస్ఈ

ఆకివీడురూరల్ ఆగస్టు 1 : చినకాపవరంలో రూ.30 కోట్లతో ఏర్పాటు చేసిన మంచినీటి పైపులైను సంపు, ఓహెచ్ఎస్ఆర్‌లను గురువారం ఆర్‌డబ్ల్యూస్ ఎస్ఈ పి. సత్యనారాయణ పరిశీలించారు. గణపవరం మండలం పరిమెళ్ళ నుంచి ఆకివీడు, కాళ్ళ మండలాలలోని గ్రామాలకు తాగునీరందించే పైపులైనును జూలై 31న పరిమెళ్ళలో, ఉండి, ఉంగుటూరు ఎమ్మెల్యేలు రఘురామకృష్ణరాజు, ధర్మరాజు ప్రారంభించారు. గణపవరానికి నీరు వచ్చిందని, గణపవరం నుంచి ఆకివీడు మండలం చినకాపవరం వచ్చే మార్గంలో పైపులైను పాడవడంతో చినకాపవరం వరకు నీటి సరఫరా నిలిపివేశారు. యుద్ధప్రాతిపదికన పైపులైనుకు మరమ్మతులు చేసి నీటిని సరఫరా చేసేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. పెదకాపవరంలోని జడ్పీ పాఠశాలను ఆయన పరిశీలించారు. డీఈ ధనానంద్, జేఈ, తదితరులున్నారు.

## విద్యార్థులకు వైద్య పరీక్షలు

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 1: పెదతాడేపల్లి గురుకుల పాఠశాలలో విద్యార్థులకు జిల్లా మలేరియా అధికారి కోసూరి రవికుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులకు గురువారం వైద్య పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులు తీసుకోవా ల్సిన జాగ్రత్తలు వివరించారు. పాఠశాల నిర్వాహకులు పిల్లలకు అందించే భోజనంలో న్యూట్రిషియన్ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ బి.రాజారావు, మలేరియా సబ్ యూనిట్ అధికారి లక్ష్మణరావు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## కార్మికులంతా సంక్షేమ బోర్డులో నమోదు కావాలి

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 1: మోత మోసే బంటా కార్మికులంతా సంక్షేమ బోర్డులో నమోదు కావడం ద్వారా కార్డులు పొంది సంక్షేమంలో భాగస్వాములు కావాలని భవన నిర్మాణ కార్మిక సంఘ తాడేపల్లిగూడెం అధ్యక్షుడు దువ్వా శ్రీనివాస్ కోరారు. తాడేపల్లిగూడెంలోని సిపాయిపేట భవన నిర్మాణ కార్యాలయం గురువారం ఆయన మాట్లాడుతూ సంక్షేమ బోర్డు ద్వారా కలిగే లాభాలు వివరించారు. కార్యక్రమంలో సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలరాతి ఆదినారాయణ, యూనియన్ వర్కింగ్ ప్రసిడెంట్ పడాల శ్రీనివాస్, కోశాధికారి కోడే సాయిబాలాజి తదితరులు పాల్గొన్నారు.

## నేడు సీపీఐ జిల్లా సమావేశం జయప్రదం చేయాలి

భీమవరం అర్బన్, ఆగస్టు 1: నేడు తణుకులో జరిగే సీపీఐ జిల్లా సమితి విస్తృత సర్వసభ్య సమావేశంను జయప్రదం చేయలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు పిలుపునిచ్చారు. శుక్రవారం ఉదయం 10గంటలకు తణుకులోని వంక సత్యనారాయణ సురాజ్య భవనంలో సమావేశం రెండు రోజులు పాటు జరగనుందన్నారు. ఈ సమావేశానికి పార్టీ శాఖా కార్యదర్శులు, సభ్యులు, సానుభూతి పరులు, ప్రజాసంఘాల నాయకులు హాజరు కావాలని కోరారు.

## పశువులకు 40 టన్నుల దానా


పశువుల కోసం లారీలో వచ్చిన దానా బస్తాలు

ఆచంట, ఆగస్టు 1 : ఇటీవల వచ్చిన గోదావరి ఉధృతి కారణంగా మండలంలోని పలు లంకగ్రామాలు జలమయం కావడంతో లంకల్లో ఉన్న పశువులకు పశుగ్రాసం లేక అల్లాడిపోతున్నాయి. ఈ తరుణంలో లంక గ్రామాల రైతులు ఎమ్మెల్యే పితాని దృష్టికి తీసుకురావడంతో గురువారం 40 టన్నుల పశువుల దానా రాగా వీటిని లంకల్లోని రైతులకు అందిస్తామని మండల పశువైద్యాధికారి పణికుమార్ తెలిపారు.

## ముత్యాలపల్లి సర్పంచ్ పల్లయ్య మృతి


పల్లయ్య (ఫైల్)

మొగల్తూరు, ఆగస్టు 1 :ముత్యాలపల్లి గ్రామ సర్పంచ్ కొపనాతి పల్లయ్య (65) గురువారం ఉదయం మృతి చెందారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఇటీవలే స్వగ్రామం వచ్చారు. ఆయనకు ఇరువురు కుమార్తెలు ఉన్నారు. స్థానిక ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, టీడీపీ ఇన్‌చార్జి రామరాజు, అధికారులు, గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.